**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం : 9700370499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ

# సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక

**టీవీ రిపోర్టర్లు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం : 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | బుధవారం 28-05-2025 | సంపుటి : 11 | సంచిక : 124 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

## ఆ ఉగ్రవాద ముల్లును తొలగించాల్సిన సమయం వచ్చింది..

న్యూఢిల్లీ: ఒక శరీరం ఎంత బలంగా ఉన్నా, ఒక ముల్లు గుచ్చుకుంటే ఎంతో నొప్పి కలుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటన సందర్భంగా అన్నారు. పాకిస్థాన్ మద్దతుతో దేశంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదమే ఆ ముల్లు అని, దాన్ని తొలగించాల్సిన సమయం వచ్చిందని ఆయన గుర్తు చేశారు. మే 27, 2025న గాంధీనగర్‌లో రూ. 5,536 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని.. దేశ భద్రత, అభివృద్ధి, సంస్కృతి, జాతీయ గౌరవం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని ప్రతి మూలలో దేశభక్తిని చూశానని, ఇది కేవలం గుజరాత్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. ప్రతి భారతీయుడి హృదయంలో ఉందని మోదీ పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో రెండో రోజు వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్ వంటి ప్రాంతాలను సందర్శించిన తర్వాత మోదీ గాంధీనగర్‌లో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. 1947 విభజన తర్వాత మొదలైన ఉగ్రవాద దాడులను గుర్తు చేసిన ఆయన, 'ఆ రోజు ముజాహిదీన్‌ను అంతమొందించి, సర్దార్ పటేల్ సలహాను పాటించి ఉండి ఉంటే, ఈ 75 ఏళ్ల ఉగ్రవాద చక్రం మనకు కనిపించేది కాదు' అన్నారు. పాకిస్థాన్ ఇప్పటికీ ఉగ్రవాదాన్ని ఒక 'పరోక్ష యుద్ధం'గా వినియోగించుకుంటోందని, కానీ అది నిజానికి ఒక వ్యూహాత్మకమైన యుద్ధమేనన్నారు ప్రధాని మోదీ. ఇటీవలి కాలంలో జరిగిన భారత ఉగ్రవాద వ్యతిరేక చర్యల గురించి కూడా ప్రధాని వివరించారు. 22 నిమిషాల్లో భారత్ 9 పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఇది కెమెరాల ముందే జరిగింది. ఇక రుజువుల కోసం ఎవరిని అడగాల్సిన అవసరం లేదు. శవపేటికలపై పాక్ జెండాలు పెట్టి, వారికి సెల్యూట్ చేయడం ద్వారా, వారు ఉగ్రవాదాన్ని తమ అధికారిక విధానంగా చెప్పుకున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా దేశ భద్రతపై మౌనంగా ఉండకుండా, ధైర్యంగా ఎదుర్కొంటామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 2014 మే 26న నేను ప్రధాని పదవిని స్వీకరించాను. అప్పటి భారత ఆర్థిక



వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానం. కానీ ప్రస్తుతం అది నాలుగో స్థానానికి చేరిందని మోదీ గుర్తు చేశారు. ప్రపంచమంతా కరోనా, ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక సంక్షోభాలు వంటి సవాళ్లను ఎదుర్కుంటున్నప్పటికీ భారతదేశం తన గమ్యాన్ని వదులుకోలేదని ఆయన అన్నారు. మన లక్ష్యం 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్. స్వాతంత్ర్యం పొందిన 100 సంవత్సరాల సందర్భంగా, మన దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే లక్ష్యంతో ముందుకెళుతున్నామన్నారు. శాంతియుత సహజీవనం భారత్ లక్ష్యమని, కానీ, ఆ శాంతిని సవాలు చేస్తే, భారతదేశం తక్షణమే స్పందిస్తుందని, ఇది వీరుల భూమి అని మోదీ వెల్లడించారు.

## తొలిరోజు మహానాడు గ్రాండ్ సక్సెస్..

### టీడీపీ శ్రేణులకు సీఎం చంద్రబాబు కితాబు





కడప: ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా వేదికగా తెలుగుదేశం మహానాడు పండుగ మూడురోజుల పాటు ఘనంగా జరుగుతోంది. ఈ కార్యక్రమానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలి వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని టీడీపీ శ్రేణులు భారీగా మహానాడు వేడుకలో పాలుపంచుకుంటున్నారు. ఈక్రమంలో సోమవార నాడు నిర్వహించిన మహానాడు సూపర్ సక్సెస్ అయింది. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నేతలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. తొలి రోజు మహానాడు జరిగిన తీరుపై సమీక్షించారు. మొదటి రోజు మహానాడు గ్రాండ్ సక్సెస్ అంటూ చంద్రబాబు కితాబిచ్చారు. కొందరు నేతలు అద్భుతంగా మాట్లాడారంటూ చంద్రబాబు అభినందనలు తెలిపారు. టైమింగ్ పాటిస్తూనే చక్కగా మాట్లాడిన నేతలకు చంద్రబాబు అభినందనలు చెప్పారు. మహానాడు తొలి రోజున పక్కా టైమింగ్ పాటించడంపై సమావేశంలో ప్రస్తావించారు. ఇదే తరహాలో సమయపాలన పాటిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు.

## హైదరాబాద్‌కు నేడు నైరుతి రుతుపవనాలు ..

### ఎప్పుడైనా భారీ వర్షం కురిసే అవకాశం..!



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన సంగతి తెలిసిందే. అంచనా వేసిన సమయం కంటే ముందుగానే రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడంతో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక ఇవాళ హైదరాబాద్ నగరాన్ని రుతు పవనాలు తాకనున్నాయి. దీంతో నగరంలో ఎప్పుడైనా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు ప్రాంతాల్లో 40 నుంచి 60 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర తీరం వరకు సగటు సముద్రమట్టం నుంచి 3.1 నుంచి 5.8 కి.మీ మధ్యలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని తెలిపింది. దీని ప్రభావంతో మంగళవారం (ఈనెల 27న) ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని, 29లోగా బలపడే సూచనలు ఉన్నాయని పేర్కొన్నది. దీంతో 27,28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

## సిందూర రేఖ ఎంత ముఖ్యమో ప్రపంచానికి చాటాం




ముంబై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'సిందూర రేఖ' ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. పహల్గాంలో 26 మంది టూరిస్టులను ఉగ్రవాదులు ఊచకోత కోసిన అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత బలగాలు పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై మెరుపుదాడులు చేసి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడాన్ని ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్‌షా ప్రస్తావించారు. మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టామని, మన తల్లులు, కుమార్తెలు, సోదరీమణుల నుదుటిపై సిందూరం ఎంత ముఖ్యమో ప్రపంచానికి చాటి చెప్పామని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని, పహల్గాం ఉగ్రదాడి వెనుక ఎవరున్నా వారిని అంతమొందిస్తామని చెప్పారు. ముష్కరులు ఎక్కడ దాక్కున్నా విడిచిపెట్టే ప్రసక్తి లేదని ప్రధానమంత్రి చాలా స్పష్టంగా చెప్పడాన్ని గుర్తుచేశారు. పహల్గాంలో ఉగ్రవాదాలు అమాయక ప్రజలను వారి కుటుంబ సభ్యుల కళ్లముందే మతం అడిగి మరీ కాల్చిచంపారని, ఇందుకు వారు మూల్యం చెల్లించక తప్పదని, ప్రతి ఒక్కరిని ఏరిపారేస్తామని చెప్పారు. దేశ సాయుధ బలగాలు, పౌరులు, సరిహద్దుల విషయంలో తాము ఎలాంటి రాజీ పడమని అమిత్‌షా తెలిపారు. మౌనంగా ఉండే శకం ముగిసింది. ప్రధాని నాయకత్వంలో భారతదేశం చాలా స్పష్టతతో, పూర్తి సామర్థ్యంతో ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటుందని చెప్పారు. పౌరులు, సరిహద్దులు, బలగాలను ఎవరు సవాలు చేసినా ప్రతిఘటన చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. బుల్లెట్‌కు బాంబుతోటే సమాధానమిస్తామని ప్రధానమంత్రి సైతం చాలా స్పష్టంగా హెచ్చరికలు చేసినట్టు తెలిపారు. మూడు రోజుల మహారాష్ట్ర పర్యటనకు ముగింపుగా ముంబైలోని మాధవ్‌బాగ్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయం 150వ వార్షికోత్సవాల్లో అమిత్‌షా పాల్గొన్నారు.

## మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక



అమరావతి: తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానిం చారు. మహానాడు... ఈ పదం విన్నా, చదివినా వెంటనే గుర్తుకు వచ్చేది 'తెలుగుదేశం'పార్టీనే అని.. అంతలా తెలుగువారిగుండెల్లో స్థిరపడిపోయిందని ప్రతి ఏటా జరిగే మహానాడు వేడుక అని ఉద్ఘాటించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. రాయలసీమ గడ్డపై... కడపలో అంగరంగ వైభవంగా జరిగే మహానాడు చారిత్రక రాజకీయ పండుగ అని వెల్లడించారు. ఈ శుభవేళ తన పక్షాన, జనసేన పార్టీ పక్షాన తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌లకి పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న పల్లా శ్రీనివాస్, బక్కని నరసింహులకు శుభాభినందనలు తెలిపారు. ప్రజాసేవ, ప్రజా ప్రయోజనమే పరమావధిగా జరుగుతున్న ఈ మూడు రోజుల వేడుకలో చర్చించనున్న ఆరు అంశాలు ప్రశంసనీయంగా ఉన్నాయని కొనియాడారు. కార్యకర్తే అధినేత, యువగళం, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండ వంటి అంశాలపై ఈ మహానాడులో చర్చించి అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించడం అభినందనీయమని ప్రశంసించారు. పసుపు వర్ణంతో ముస్తాబైన మహానాడు ప్రాంగణం శోభాయమానంగా కనువిందు చేస్తోందని అన్నారు.

## దేశంలో క్రమంగా పెరుగుతున్న కొవిడ్ కేసులు



కరోనా వైరస్ మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. గత నెలన్నరగా కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నది. భారత్ (ఎనిటతిజీ)లోనూ వైరస్ వ్యాప్తి ఎక్కువగానే ఉంది. ఇప్పటి వరకూ (మే 27 నాటికి) దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య వెయ్యి దాటింది. ప్రస్తుతం భారత్‌లో కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య 1,010కి చేరినట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా కేరళలో 400కిపైగా వైరస్ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ కేసులు పెరుగుతున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటి వరకు నిర్వహించిన అధ్యయనాల్లో ఒమిక్రాన్ ఇతర వేరియంట్స్ కన్నా ఇన్ఫెక్షన్ రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం తక్కువగా ఉన్నట్లు నిపుణులు గుర్తించారు. అమెరికా, సింగపూర్ వంటి దేశాల్లో ఈ వేరియంట్ కారణంగా కేసులు వేగంగాపెరుగుతున్నట్లు తేలింది. ఆయా దేశాల్లో ఆసుపత్రుల్లో చేరిన రోగుల సంఖ్య పెరిగింది. ఈ వేరియంట్ కారణంగా జనవరిలో చైనాలో మరోసారి ఇన్ఫెక్షన్ పెరుగుదల ఉండవచ్చని నిపుణులుఆందోళనవ్యక్తంచేశారు. కరోనా జేఎన్.1వేరియంట్ప్రపంచవ్యాప్తంగాఆరోగ్య సమస్యలను పెంచుతుంది.

## కేబినెట్ విస్తరణకు ముహూర్తం

హైదరాబాద్, మే 27తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ మళ్లీ తెరపైకి వచ్చింది. ముఖ?యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే బస చేయడంతో మంత్రి వర్గ విస్తరణ కోసమేనని జోరుగా ప్రచారం జరుగుతోంది. నీతి ఆయోగ్ భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ పెద్దలతో భేటీ అయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జితో చర్చించారు. ఆదివారం రాత్రి సమావేశంలో ఓ నిర్ణయానికి రాలేకపోవడంతో సోమవారం కూడా సీఎం ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. తెలంగాణ మంత్రి వర్గంలోకి కొత్తగా ఎంతమందికి అవకాశం కల్పించాలనే విషయంలో పార్టీలో చర్చ కొనసాగుతోంది. మంత్రి వర్గ రేసులో మహబూబ్ నగర్ నుంచి శ్రీహరి, నిజామాబాద్ జిల్లా నుంచి పి. సుదర్శన్ రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, కరీంనగర్ జిల్లా నుంచి ఆదిశ్రీనివాస్, మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్ వంటి వారు విజయశాంతి పేరు కూడా కొత్తగా తెరపైకి వచ్చింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వెలమలలో ప్రేమ్ సాగర్ రావు, ఎస్సీలలో గడ్డం వివేక్, ఎస్టీలలో బాలూనాయక్, శంకర్ నాయక్, ఓబీసీ నుంచి వాకాటి శ్రీహరి, విజయశాంతిల పేర్లు ఉన్నాయి.

# సంపాదకీయం

బుధవారం 28-05-2025

## కొత్త చరిత్ర సృష్టిస్తున్న భారత్

ఒకప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న భారత్ ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక రంగంలో తనదైన ముద్ర వేస్తోంది. 140 కోట్లకు పైగా జనాభాతో అపారమైన మానవ వనరులతో బలమైన దేశీయ డిమాండ్‌తో ఇండియా దూసుకుపోతుంది. తాజాగా ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి కొత్త చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో జపాన్‌ను అధిగమించడం ఒక ముఖ్యమైన మైలురాయి. కేవలం రెండున్నర నుంచి మూడేళ్లలో జర్మనీని కూడా దాటి మూడో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ ఈ స్థాయికి చేరుకోవడానికి అనేక కారణాలు దోహదపడ్డాయనే చెప్పాలి. నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి గణాంకాలను తెలుపుతూ.. భారతదేశం 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని స్పష్టం చేశారు. బలమైన దేశీయ వినియోగం భారతదేశంలో భారీ జనాభా ఉండడం వల్ల దేశీయంగా వస్తువులు, సేవల వినియోగం గణనీయంగా పెరిగింది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఒక స్థిరమైన పునాదిని అందించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుదల ఆర్థిక వృద్ధికి దోహదపడింది. మౌలిక సదుపాయాల కల్పన (రోడ్లు, పోర్టులు, విద్యుత్), డిజిటల్ ఇండియా వంటి పథకాలలో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టింది. ఊూ, దివాలా కోడ్  వంటి సంస్కరణలు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి. వ్యాపారం చేయడానికి సులువుగా ఉండే వాతావరణాన్ని కల్పించాయి. 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాలు దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాయి. ఐటీ, సాఫ్ట్‌వేర్ సేవలు వంటి వాటిలో భారత్ ఈ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. సేవల రంగం జీడీపీలో సింహభాగాన్ని కలిగి ఉంది. స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా  ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి తీసుకున్న చర్యలు, ప్రభుత్వ ఆర్థిక విధానాలు స్థిరత్వాన్ని అందించాయి. ఇది పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని చూస్తున్న ప్రపంచ కంపెనీలు, భారతదేశాన్ని ఒక ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా చూస్తున్నాయి. ముఖ్యంగా ఆపిల్ వంటి దిగ్గజ కంపెనీలు భారతదేశంలో తమ ఉత్పత్తిని పెంచాలని చూస్తున్నాయి. నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం చెప్పినట్లు.. డోనాల్డ్ ట్రంప్ వంటి వారు ఆపిల్ ఫోన్ల తయారీ అమెరికాలోనే జరగాలని డిమాడ్ చేస్తున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భారతదేశం ఆపిల్ ఫోన్లను మరింత చౌకగా తయారు చేయగల దేశంగా భారత్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇది భారతదేశానికి పెద్ద సానుకూల అంశం. రెండో విడత అసెట్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు.. దీనిని ఆగస్టులో ప్రకటిస్తామని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇది ప్రభుత్వానికి మరింత ఆదాయాన్ని సమకూర్చి, పెట్టుబడులకు దోహదపడుతుంది. ప్రస్తుతం ఈ ప్రపంచంలో టాప్ త్రీ ఆర్థిక వ్యవస్థల్లో అమెరికా, చైనా, జర్మనీ ఉన్నాయి. 2047 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ప్రధాని మోదీ చెబుతూ వస్తున్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలను వివరించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి, పరిశోధన అభివృద్ధి  వంటి రంగాలపై మరింత దృష్టి పెట్టడం అవసరం. భారతదేశం కేవలం ఆర్థికంగానే కాకుండా ప్రపంచ వేదికపై తన ప్రభావాన్ని కూడా పెంచుకుంటోంది. 'విశ్వగురు'గా మారాలన్న లక్ష్యం, ఆర్థిక బలోపేతంతో మరింత సాధ్యమవుతుంది. అంతర్జాతీయంగా ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ సాఫీగా ముందుకు సాగుతోంది. బలమైన సూక్ష్మ ఆర్థిక వనరులు, ఆర్థిక విధానాల్లో స్థిరత్వం ఇందుకు దోహదపడుతున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, కమోడిటీ ధరల పెరుగుదల, భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావంతో ఫైనాన్షియల్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు మొదలైన సవాళ్లను ఎదుర్కొంటోంది. 2031 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ భారత ఆర్థిక వ్యవస్థ కోసం ఒక నివేదికను విడుదల చేసింది. ఈ కాలంలో దేశ జిడిపి వార్షిక వృద్ధి రేటు 6.7 శాతానికి తగ్గుతుంది. 2025 ఆర్థిక సంవత్సరం నుండి 2031 ఆర్థిక సంవత్సరం వరకు వార్షిక జీడీపీ కోవిడ్ మహమ్మారికి ముందు దశాబ్దంలో (10 సంవత్సరాలు) సగటు వృద్ధి రేటు 6.6 శాతంగా ఉంటుందని కూడా పేర్కొంది. ప్రపంచ పరిస్థితులలో ఏదైనా పెరుగుదల, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తత సరఫరా గొలుసులో అంతరాయం కలిగించవచ్చు దేశాల మధ్య వాణిజ్యంలో అంతరాయం ఏర్పడవచ్చు. ముడి చమురు ధరలు పెరగవచ్చు. ప్రపంచ సమస్యలు దేశ ద్రవ్యోల్బణం రేటును ప్రభావితం చేయవచ్చు. ఇన్‌పుట్ ఖర్చులు పెరగవచ్చుఆర్థిక లోటును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల ప్రభావం అభివృద్ధిపై కూడా కనిపించాలి. నివేదికలో,   వృద్ధి, ద్రవ్యోల్బణానికి ప్రధాన ప్రమాదాలుగా పరిగణించబడ్డాయి.

# గ్రామాల్లో పారిశుద్ధ్యం చర్యలు ముమ్మరంగా చేపట్టండి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి.
పిఆర్ వన్ యాప్ లో సరైన వివరాలు నమోదు చేయండి.
స్వచ్ఛంద–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టండి.
యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి.
జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



నంద్యాల(విజయ సారథి):గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టి జిల్లాను పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం, ఐహెచ్హెచ్ఎల్, సోక్ పిట్స్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, చెత్త సంపద తయారీ కేంద్రాలు తదితర అంశాలపై డిఆర్ఈఓ, డిఈఈ, ఎఈ, డిప్యూటీ ఎంపిడిఓలు, ఈఓఆర్డిలు, ఎంఆర్పిలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఇంచార్జి డిపిఓ శివారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పిడి వెంకటసుబ్బయ్య, డిపిఆర్పి మంజులవాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఎక్కడపడితే చెత్తాచెదారం పేరుకుపోయిందని పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టి జిల్లాను పరిశుభ్రంగా ఉండేలా మనసు పెట్టి పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో 24 పర్యాటక కేంద్రాలున్నాయని వాటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం ఉండకుండా పరిశుభ్రత చర్యలు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ట్యాంకులపైన, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా ఎంపిడిఓలు, ఈఓఆర్డిలు ఒక చిన్న పిట్ ను తవ్వించి చెత్తంతా ఒకచోట చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో ట్యాంకులను పరిశుభ్రం చేసి తదుపరి పరిశుభ్రం చేయాల్సిన తేదీని కూడా ట్యాంకుపై వ్రాయాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ట్యాంకు క్లీనింగ్ రిజిస్టరు కూడా నిర్వహించి చుట్టుపక్కల ఉన్న ప్రజలచే సంతకాలు చేయించాలన్నారు. నీటిని ఎప్పటికపుడు క్లోరినేషన్ చేయాలని జిల్లాలో 20 నుండి 120 కిఎల్ సామర్థ్యం ఉన్న ట్యాంకులు ఉన్నాయని, అవసరాన్ని బట్టి నీటిలో ఎంతమేరకు బ్లీచింగ్ పౌడర్ కలపాలన్నది కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో నీటి పరీక్ష కిట్లు తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నీటి ప్రవాహం చుట్టూ చెత్తచెదారం ఉండకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో డయేరియాను నివారించడానికి గాను ఇన్టెన్ క్లోరినేషన్ తప్పనిసరిగా అందించాలన్నారు. ఒక్కసారి విరోచనాలు అయినా కూడా దగ్గరలోని పిహెచ్సి/సిహెచ్సి చేర్పించి చికిత్స అందించాలన్నారు. వర్షాకాలం ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముమ్మర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు 1971 మంజూరు చేసామని అందులో ఇంకా 930 పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఈఓఆర్డిలు, ఎంఆర్పిలను కలెక్టర్ ఆదేశించారు. సోక్ పిట్స్ కు సంబంధించి పెండింగ్ ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలని చాగలమర్రి, మిడ్తూరు మండలాల్లో ఎక్కువగా అనుమతులు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ కు సంబంధించి కొత్తగా బిసి వసతి గృహాలకు 27, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు 28, ఇతర పర్యాటక ప్రాంతాల్లో 8 మంజూరు చేయడం జరిగిందని వాటిని నాణ్యతతో నిర్మించాలన్నారు. వ్యక్తిగత సోక్ పిట్స్ కు సంబంధించి 5,777 కేటాయించడం జరిగిందని అందులో 2,223 నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని పెండింగ్ ఉన్న వాటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. వాటర్ క్వాలిటీ రిజెక్టేడ్ రికార్డ్స్ కు సంబంధించి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఎంఎల్హెచ్పి లాగిన్ లో వచ్చిన వివరాలను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా చూడాలన్నారు. అదే విధంగా ఈఓఆర్డిలు ఒక గ్రామాన్ని తనిఖీ చేసి మరుసటి సమావేశం నాటికి పిఆర్ వన్ యాప్ లో వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణపై మార్చి, ఏప్రిల్ మాసంలో సిఎం కార్యాలయం నుండి వచ్చిన నివేదిక ఆధారంగా కొత్తపల్లి, బనగానపల్లె, ప్యాపిలి, మిడ్తూరు తక్కువ శాతం సేకరిస్తున్నాయని మరుసటి సమావేశం నాటికి పురోగతి లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ ఈఓఆర్డిలను హెచ్చరించారు. క్లాప్ మిత్రాలు తెస్తున్న తడి, పొడి చెత్త వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి ఇప్పటి వరకు 68 స్థలాలు గుర్తించాలని సదరు విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పత్రికల్లో వచ్చే ప్రతికూల అంశాలపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛఆంధ్రకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు ప్రతి నెల నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు సేకరించి ప్రతి సచివాలయం, మండల కార్యాలయాలలో గోడకు థీమ్ ల ప్రకారం ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఈఓఆర్డీలను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా జూన్ నెలలో నీరు–మీరు అనే కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ శాఖ ఆధ్వర్యంలో పల్లె పుష్కరిణి అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అందుకు స్థానికంగా ఉన్న ట్యాంకులను పరిశుభ్రం చేయడంతో పాటు చెరువుగట్లను బలోపేతం చేసి పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగాంధ్రాకు సంబంధించి జూన్ 16వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులు అందరూ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. అందుకు అవసరమైన శిక్షణను ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఉద్యోగులందరూ తప్పనిసరిగా యోగాంధ్ర యాప్ లో రిజిస్టర్ కావాలని కలెక్టర్ ఈఓఆర్డిలను ఆదేశించారు. అనంతరం పిఆర్ వన్ యాప్ ను ఓపెన్ చేసి అందులో ఈఓఆర్డిలు నమోదు చేయాల్సిన అంశాలపై కలెక్టర్ పరిశీలించారు.

# పార్టీకి తలనొప్పిగా మారిన లాలు కొడుకు



పాట్నా, మే 27,   ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి అలాగే కుటుంబం నుంచి కూడా బహిష్కరించారు. ఆయనపై ఇంత కఠిన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. నిజానికి, తేజ్ ప్రతాప్ యాదవ్ తన ప్రత్యేకమైన వేశధారణ, పూజా ఆచారాలు, వివాదాస్పద వ్యాఖ్యలపై బిహార్ మీడియాలో తరచు నిలుస్తుంటారు. కొంతకాలం క్రితం ఈ సంవత్సరం హోలీ రోజున, తేజ్ ప్రతాప్ యాదవ్ తన బాడీగార్డ్‌ను హోలీ మిలన్ సందర్భంగా యూనిఫాంలో డ్యాన్స్ చేయమని ఆదేశించడం తీవ్ర వివాదాస్పదమైంది. ఈ అంశం బిహార్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సీనియర్ సహాయకుడు జగదానంద్ సింగ్‌తో తేజ్ ప్రతాప్‌కు విభేదాలు ఉన్నట్లు సమాచారం. నిజానికి నాలుగు సంవత్సరాల క్రితం తేజ్ ప్రతాప్ యాదవ్ రాష్ట్రీయ జనతాదళ్ ప్రముఖ నాయకుడు, బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు జగదానంద్ సింగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. జగన్నాథ్ సింగ్ కు వ్యతిరేకంగా ఆయన బహిరంగంగా తన స్వరాన్ని పెంచడమే కాకుండా, జగదానంద్ సింగ్ తో ఆయనకున్న శత్రుత్వం ఆర్జేడీ అగ్ర నాయకత్వాన్ని కూడా చేరేంతగా పెరిగింది. తేజ్ ప్రతాప్ యాదవ్ మద్దతుదారుడు ఆకాశ్ యాదవ్‌ను జగదానంద్ సింగ్ విద్యార్థి ఆర్జేడీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తొలగించి, గగన్ యాదవ్‌ను విద్యార్థి ఆర్జేడీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేసినప్పుడు వాస్తవానికి ఈ మొత్తం విషయం వెలుగులోకి వచ్చింది. గగన్ యాదవ్‌ను తేజస్వి యాదవ్ మద్దతుదారుగా పరిగణించేవారు. రెండేళ్ల క్రితం బీహార్‌లో మహా కూటమి ప్రభుత్వం ఉన్నప్పుడు, తేజ్ ప్రతాప్ యాదవ్ పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రిగా ఉన్నారు. అప్పుడు అతను నరేంద్ర మోదీని దేశద్రోహి అని విమర్శించారు. ప్రతిపక్ష ఇండియా అలయన్స్ నాయకులను ప్రధాని మోదీ అహంకారి అని విమర్శించినప్పుడు ఆయన కౌంటర్‌గా ఆ వ్యాఖ్య చేశాడు. ఈ విషయంపై తేజ్ ప్రతాప్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆయన ఒక దేశద్రోహి అని అన్నారు. అప్పుడు బిజెపి తేజ్ ప్రతాప్ యాదవ్‌కు వ్యతిరేకంగా గట్టి నిరసనలు తెలిపింది. 2017లో తేజ్ ప్రతాప్ యాదవ్ ప్రధాని మోదీ గురించి అలాంటి ప్రకటన చేయడంపై సర్వత్రా చర్చ జరిగింది. వాస్తవానికి, 2017లో కేంద్ర ప్రభుత్వం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఉన్న జి ప్లస్ భద్రతను తొలగించింది. దీని కారణంగా మొత్తం రాష్ట్రంలో రాజకీయ వివాదం తలెత్తింది. ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే తేజ్ ప్రతాప్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లాలూ జీ హత్యకు కుట్ర పన్నడంలో భాగంగానే ఆయనకు భద్రత తొలగించారంటూ తేజ్ ప్రతాప్ ఆరోపించారు. గత సంవత్సరం తేజ్ ప్రతాప్ యాదవ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యే ముఖేష్ రోషన్‌కు షాకిచ్చారు. నిజానికి గత ఏడాది డిసెంబర్ నెలలో తేజ్ ప్రతాప్ యాదవ్, ముఖేష్ రోషన్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న అసెంబ్లీ స్థానం నుండి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ప్రకటనతో ముఖేష్ రోషన్ ఏకంగా మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్నారు. పార్టీ మనల్ని పొలాలు దున్నమని చెబితే, మనం వెళ్లి పొలాలు దున్నుతామని కూడా ఆయన అన్నారు. తేజ్ ప్రతాప్ యాదవ్ డిసెంబర్‌లో మహువా అసెంబ్లీ నియోజకవర్గ పర్యటనకు వెళ్లారు. అక్కడ మీడియా తేజ్ ప్రతాప్ యాదవ్‌ను మహువా నుంచి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా అని అడిగారు. దీని తర్వాత, తేజ్ ప్రతాప్ యాదవ్ తాను గతంలో మహువా నుండి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, కొంత పని చేశానని చెప్పాడు. ఇక్కడి ప్రజలు కోరుకుంటే, నేను కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేసి మళ్ళీ మహువాలో పని చేస్తాను అని ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత ముఖేష్ రోషన్ ఏడుస్తున్న వీడియో వైరల్ అయింది. వివాహమైన కొన్ని నెలలకే తన భార్య ఐశ్వర్య రాయ్ పై విడాకుల పిటిషన్ దాఖలు చేయడం ద్వారా తేజ్ ప్రతాప్ యాదవ్ లాలూ కుటుంబానికి చాలా అసౌకర్య పరిస్థితిని సృష్టించారు. తేజ్ ప్రతాప్ యాదవ్ 2018 మేలో ఐశ్వర్య రాయ్‌ను వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన కొన్ని నెలల తర్వాత అంటే నవంబర్ 2018లో తేజ్ ప్రతాప్ తన భార్య నుండి విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు.

## గోల్డెన్ డోమ్‌తో అంతరిక్ష అణు యుద్ధం: ఉత్తర కొరియా



ప్యోంగ్‌యాంగ్: బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణుల నుంచి రక్షణ కల్పించేందుకు అమెరికా సర్కారు గోల్డెన్ డోమ్‌ను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దీనిపై ప్రకటన చేశారు. గోల్డెన్ డోమ్ రక్షణ కవచం.. అంతరిక్ష అణ్వాయుధ యుద్ధానికి దారి తీసే అవకాశాలు ఉన్నట్లు ఉత్తర కొరియా పేర్కొన్నది. ఉత్తర కొరియాకు చెందిన విదేశాంగ శాఖ ఆ డోమ్ వార్తలపై స్పందిస్తూ మూర్ఖత్వంతో అమెరికా అలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించింది. అంతరిక్షాన్ని సైనిక క్షేత్రంగా మారుస్తున్నట్లు ఉత్తర కొరియా పేర్కొన్నది. ట్రంప్ వేసిన ప్లాన్‌తో ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల సమీకరణ పెరుగుతుందని నార్త్ కొరియా వెల్లడించింది. అమెరికా, దక్షిణ కొరియా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాల ను కూడా ఉత్తర కొరియా తప్పు పట్టింది. అమెరికా నిర్మిస్తున్న గోల్డెన్ డోమ్ కవచంతో .. తమ అణ్వాయుధ సామర్థ్యం తగ్గిపోతుందని ఉత్తర కొరియా చెప్పింది. కొరియా యూనివర్సిటీకి చెందిన సీనియర్ విశ్లేషకుడు హంగ్ మిన్ తెలిపారు. మిస్సైల్ రక్షణ వ్యవస్థను ఒకవేళ అమెరికా పూర్తి చేస్తే, అప్పుడు ఆ కవచాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ ఆయుధాలను డెవలప్ చేయాల్సి ఉంటుందని ఉత్తర కొరియా తెలిపింది. తమ వద్ద అణ్వాయుధాలు ఉన్నట్లు 2022లో ఉత్తర కొరియా చట్టాన్ని పాస్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పలు సందర్భాల్లో బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లను పరీక్షించింది.

# కొడాలికి బిగ్ షాక్

విజయవాడ, మే 27, మాజీ మంత్రి కొడాలి నానికి బిగ్ షాక్ తగలనుంది. నేడో, రేపు కొడాలి నాని అరెస్టు కానున్నట్లు తెలుస్తోంది. కేసుకు విచారణకు సహకరించకపోవడం, పారిపోతాడనే కారణంతో ఇప్పటికే కొడాలి నానిపై లుక్ అవుట్ వారెంట్ జారీ చేశారు. అయితే కొడాలి నాని గత కొంత కాలం నుంచి అనారోగ్యం బారిన పడటంతో చికిత్స తీసుకుంటున్నాడు.కొడాలి నానిపై ఇప్పటికే కేసులు ఉన్నాయి. రైతు మోషే కేసు, వాలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించడం వంటి ఆరోపణలు ఉన్నాయి. అలాగే వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేష్‌పై సోషల్ మీడియాలో అసభ్యకరంగా మాట్లాడారని కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు ఇసుక, మట్టి, భూకబ్జాలకు సంబంధించి ఆరోపణలు, టిడ్కో ఇళ్ల పంపిణీ, జగనన్న కాలనీలో మెరక పేరుతో రూ.45 కోట్ల అవినీతి, విద్యుత్ అక్రమాలపై విజిలెన్స్ ఆరోపణలు ఉన్నాయి. వీటిన్నింటిపై విచారణ జరుగుతోంది.ఇదిలా ఉండగా కొడాలి నాని ఇటీవల హైదరాబాద్ లోని సంధ్య కన్వెన్షన్ లో ఓ వివాహ వేడుకకు హాజరైనట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే నానికి ఇటీవల హార్ట్ ఆపరేషన్ జరిగింది. దీంతో ఆయన హైదరాబాద్ లో విశ్రాంతి తీసుకుంటున్నారు.నాని ఆరోగ్యం ఇంకా సెట్ కాలేదని మెరుగైన చికిత్స కోసం ఆయన అమెరికా వెళ్లనున్నట్లు వార్తలు కూడా వచ్చాయి. ఈ క్రమంలోనే కృష్ణ జిల్లా ఎస్పీ నానిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. నాని అమెరికా వెళ్లకుండా అడ్డుకునేందుకే ఈ నోటీసులు జారీ అయినట్లు ప్రచారం జరిగింది. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కొడాలి నానిపై లుకౌట్ నోటీసు జారీ అయ్యింది. ఏపీలో కొడాలి నానిపై ఇప్పటికే అనేక కేసులు నమోదు కావడంతో.. దేశం విడిచి పారిపోతారనే ఊహాగానాలతో ఈ లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. అయితే లుకౌట్ నోటీసులు జారీ చేసిన రోజే మాజీ మంత్రి కొడాలి నాని ట్విస్ట్ ఇచ్చారు.. ఆయన హైదరాబాద్‌లో ఓ శుభకార్యానికి హాజరై అందరికి షాకిచ్చారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఒక వేడుకలో కనిపించారు. ఒక వైపు ఏపీ పోలీసులు విదేశాలకు పారిపోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేశామని హడావిడి చేస్తుంటే.. కొడాలి నాని మాత్రం హైదరాబాద్‌లో ప్రత్యక్షం కావడం చర్చనీయాంశమైంది. ముంబైలో సర్జరీ తర్వాత కొడాలి నాని బయటకు వచ్చారు. ఈ సర్జరీ తర్వాత ఆయన చాలా సన్నగా అయ్యారు.వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానిపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.



కేంద్ర హోంశాఖలోని ఇమిగ్రేషన్ విభాగం ఆయనపై ఓూఅ (లుకౌట్ సర్క్యులర్) జారీ చేసింది. ఆయన వైద్యం కోసం విదేశాలకు వెళ్లే అవకాశం ఉండటంతో కృష్ణా జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కొడాలి నాని అక్రమాలపై విచారణ జరుగుతుండటంతో ఆయన దేశం విడిచి వెళ్లకుండా ఈ చర్యలు తీసుకున్నారు. గుండె సమస్యతో బాధపడుతూ ముంబైలో సర్జరీ చేయించుకోగా.. ఆయన మెరుగైన వైద్యం కోసం అమెరికాకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ముందు జాగ్రత్తగా ఓూఅ జారీ చేశారు.. అలాగే ఆయన పాస్‌పోర్ట్ వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.నానిపై ఇప్పటికే కేసులు నమోదైన సంగతి తెలిసిందే. రైతు మోషే కేసు, వాలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించడం వంటి ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, లోకేష్‌పై సోషల్ మీడియాలో అసభ్యకరంగా మాట్లాడారని కేసులు నమోదయ్యాయి. ఇసుక, మట్టి, భూకబ్జాలకు సంబంధించిన ఆరోపణలు కూడా ఉన్నాయి. టిడ్కో ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని.. జగనన్న కాలనీలో మెరక పేరుతో రూ.45 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది.అలాగే 2022లో నిబంధనలకు విరుద్ధంగా గుడివాడలో క్యాసినో నిర్వహించారని ఆరోపణలు ఉన్నాయి. గుడివాడ ఆటోనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం గోదాము ఖాళీ చేయించారని ఆయనతో పాటు అప్పటి జేసీ మాధవీలత, ఇతరులపై బాధితుడు ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై గుడివాడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భీమేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలకు చెందిన సుమారు 9 ఎకరాల భూమిని కాజేయడానికి ప్రయత్నించారని ఫిర్యాదులు వచ్చాయి. దీనికి సంబంధించిన ఫైలు కనిపించకుండా పోయిందనే ఆరోపణలు వచ్చాయి.. అప్పట్లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదట. ఈ క్రమంలో కొడాలి నానిపై లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. కొడాలి నాని ఇటీవల అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అయితే గుండెం సంబంధిత సమస్యలు ఉన్నాయని.. మెరుగైన వైద్యం కోసం ముంబైకు ప్రత్యేక విమానంలో తరలించారు. అక్కడ ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండా కీలకమైన కార్డియాక్ సర్జరీలను చేశారు. కొడాలి నాని ముంబైలోనే కొద్దిరోజులు ఆస్పత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నారు.. ఆయన కోలుకున్న తర్వాత తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు.

# ఫీజు రీ ఎంబర్స్ మెంట్ పై సర్వే

విజయవాడ, మే 28,ఏపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల చెల్లింపులపై సర్వే చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యార్థులు తమ ఫీజు చెల్లింపు రసీదులు సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఫీజు చెల్లిస్తే ఆ డబ్బులు విద్యార్థి లేదా తల్లి జాయింట్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లింపుపై సర్వే ప్రారంభించింది. కాలేజీల్లో ఫీజు బకాయిలు చెల్లించిన వారు, చెల్లించని వారు తప్పనిసరిగా గ్రామ, వార్డు సచివాలయాల్లో బయోమెట్రిక్ థంబ్ వేయాల్సి ఉంటుంది. ఫీజు చెల్లిస్తే ఆ రసీదులను సచివాలయాల్లో సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.2023-24 విద్యాసంవత్సరంలో ఒక టర్మ్ ఫీజు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన టర్మ్ ఫీజులు విడుదల చేయాల్సి ఉంది. ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ చేస్తుంది. 2023-24 విద్యాసంవత్సరం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం సమాచారం సేకరిస్తుంది.విద్యార్థుల బకాయిల సమస్యను పరిష్కరించేందుకు....గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సమాచారాన్ని సేకరిస్తుంది. 2023-24 విద్యా సంవత్సరానికి కాలేజీలకు ఫీజు చెల్లించిన వారికి నగదు తిరిగి అందించేందుకు సర్వే చేపట్టింది.గతంలో విద్యార్థులు కాలేజీలకు ఫీజు చెల్లించినప్పటికీ తమకు ఎటువంటి రీయింబర్స్మెంట్ రాలేదని వాపోతున్నారు. దీంతో గతంలో ఫీజు చెల్లించిన వారికి తిరిగి పేమెంట్ నేరుగా విద్యార్థి తల్లి లేదా జాయింట్ అకౌంట్ లో జమ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఫీజు చెల్లించకపోతే....ఆ బకాయిలను కాలేజీ ఖాతాల్లో, ఫీజు చెల్లిస్తే ఆ నగదును విద్యార్థుల లేదా వారి తల్లి ఖాతాల్లో జమ చేయనున్నారు.ఇందుకోసం జ్ఞానభూమి యాప్‌లో ఓ ప్రత్యేక ఆప్షన్‌ను తీసుకొచ్చింది. దీంతో పాటు సచివాలయాల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు వివరాలు సేకరిస్తున్నారు. విద్యార్థులు లేదా వారి తల్లులు గ్రామ, వార్డు సచివాలయాన్ని సందర్శించి ఫీజు చెల్లింపు రసీదులు ఉంటే సమర్పించి బయోమెట్రిక్ వేయాలి.విద్యార్థి కాలేజీకి చెల్లింపు ఫీజు వివరాలు, రసీదులు, చెల్లింపు తేదీ... సచివాలయ ఉద్యోగులకు సమర్పించారు. వారు తమ లాగిన్ లో వివరాలు నమోదు చేస్తారు. ఈ వివరాలు సమర్పించిన తర్వాత విద్యార్థి లేదా వారి తల్లి బయోమెట్రిక్ వేసి ప్రక్రియ పూర్తి చేయవచ్చు. ఫీజు రసీదులు లేకపోతే కాలేజీలను సంప్రదించి నకిలీ కాపీలు పొందవచ్చు.రీయింబర్స్మెంట్ సర్వే పూర్తయిన తర్వాత ప్రభుత్వం బకాయిలను సకాలంలో విడుదల చేయనుంది. ఫీజు కట్టేస్తే నగదు విద్యార్థి తల్లి లేదా జాయింట్ అకౌంట్ లో జమ చేస్తారు. ఫీజు చెల్లించకపోతే ఆ బకాయిలు కాలేజీ ఖాతాలో జమ చేస్తారు.

# స్పోర్ట్స్ కోటా లో దొంగాట

నెల్లూరు, మే 27 క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లను సొమ్ము చేసుకునేందుకు కొందరు నేతలు, కొన్ని క్రీడా సంఘాలు ప్రయత్నిస్తున్నాయని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఆరోపించింది. క్రీడల్లో నకిలీలను తొలగించి.. అసలైన క్రీడాకారులకు న్యాయం చేయాలని, అర్హులకే స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు దక్కాలని డిమాండ్ చేస్తున్నారు.ఏపీ మెగా డిఎస్సీ 3శాతం స్పోర్ట్స్ రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో శాప్ నిబంధనల తీరుపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో డీఎస్సీ క్రీడా కోటా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో క్రీడా సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వైసీపీ ప్రభుత్వ హయంలో జరిగిన జూడో క్రీడ నకిలీ సర్టిఫికెట్లపై వెంటనే దర్యాప్తు జరగాలని ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం డిమాండ్ చేశారు.మెగా డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీలో భాగంగా చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో క్రీడా సంఘాల ప్రతినిధులకు ఉన్న ప్రాధాన్యతను ఎత్తివేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు అవినీతి అక్రమాలకు దారి తీస్తుందని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం ఆరోపించారు.అసలైన క్రీడాకారులకు న్యాయం జరగాలంటే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో క్రీడా సంఘాల ప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీవోఏ సర్వసభ్య సమావేశం విజయవాడలో జరిగింది.క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి పతకాలు సాధించిన క్రీడాకారులకు క్రీడా సంఘాలు సర్టిఫికెట్లను మంజూరు చేస్తాయని, క్రీడల్లో ప్రవేశించిన కొందరు దొంగలు అసలైన క్రీడాకారులకు కాకుండా క్రీడల్లో ఎలాంటి ప్రాతినిధ్యం లేని వ్యక్తులకు సర్టిఫికెట్లను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు.క్రీడల్లో అక్రమాలతో సంవత్సరాల తరబడి కఠోర శిక్షణ తీసుకుని, నిరంతర శ్రమతో సర్టిఫికెట్ సాధించిన అసలైన క్రీడాకారులకు అన్యాయం జరుగుతందన్నారు. ఉద్యోగాల భర్తీ సమయంలో క్రీడాకారులు ధరఖాస్తునకు జతపర్చిన క్రీడా సర్టిఫికెట్ అసలైనదా..?, నకిలీదా..? అనే విషయాన్ని క్రీడా సంఘాలు ధృవీకరించాల్సి ఉండగా అవేమి లేకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడంపై సందేహాలు వ్యక్తం చేశారుడీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీల్లో క్రీడా సంఘాలకు ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో అక్రమాలు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో క్రీడా సంఘాలకు ప్రాధాన్యత ఉన్న రోజుల్లోనే జూడో పేరుతో నకిలీ సర్టిఫికెట్లతో సచివాలయాల్లో, పశుసంవర్ధక శాఖలో ఉద్యోగాలు పొందారని, దానిపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.జూడోలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారి వివరాలను సేకరించి, పూర్తి ఆధారాలతో 2024 సెప్టెంబర్ 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని, దీనిపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, శాప్‌లో ఉన్న కొందరు అధికారులు నకిలీ సర్టిఫికెట్లకు సూత్రధారులని ఆరోపించారు.అసలైన క్రీడాకారులకు అన్యాయం చేస్తూ.., నకిలీలకు, క్రీడా కేటుగాళ్లకు శాప్ కొమ్ము కాస్తున్నారని, జూడో క్రీడ నకిలీ సర్టిఫికెట్లపై తిరుపతిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సర్టిఫికెట్ల వాస్తవికతను రుజువు చేసే ఫాం?2 లను గుర్తింపు లేని సంఘాలకు క్రీడా సంఘాలకు శాప్ పంచి పెడుతుందని ఆరోపించారు,కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ టాప్?9 ప్రయారిటీ జాబితాను రాష్ట్రంలోనూ అమలు చేయాలని, క్రీడల్లో అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, బాక్సింగ్ క్రీడాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఆ తరువాత మిగిలిన క్రీడాంశాలకు, ఆ తరువాత కేటగిరి?బి క్రీడాంశాలకు అవకావం ఇవ్వాలని డిమాండ్ చేశారు.క్రీడల్లో రాజకీయ జోక్యం తగదని, అన్ని క్రీడా సంఘాల్లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని తెలిపారు. అయితే ఇటీవల కాలంలో మితిమీరిన రాజకీయ జోక్యంతో క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.రాష్ట్రంలో అసలైన క్రీడాకారులకు న్యాయం చేసి, నకిలీ క్రీడాకారులు, క్రీడా సంఘాలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి పురుషోత్తం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బాక్సింగ్, జూడో, ఫుట్‌బాల్, రెజ్లింగ్, స్క్వాష్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, తైక్వాండో, ఫెన్సింగ్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాలో వజ్రాల వేట,

### రైతుకు దొరికిన రూ.30లక్షల వజ్రం

కర్నూలు, మే 27,తొలకరి వర్షాలు కురవగానే కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. ఈ ఏడాది వానలు ముందే పలకరించడంతో కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వజ్రాల కోసం వెదుకులాట మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఓ వ్యక్తికి రూ.30లక్షల విలువైన వజ్రం దొరికినట్టు విస్తృతంగా ప్రచారం జరిగింది.తొలకరి వర్షాలు కురుస్తుండటంతో కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో వజ్రాల వేట ప్రారంభమైంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి పొలాల్లో వజ్రాల కోసం వెతుకుతున్నారు. చిన్న వజ్రం దొరికినా తమ జీవితాలు మారిపోతాయనే ఆశతో పొలాలను జల్లెడ పడుతున్నారు. తుగ్గిలితో పాటు పరిసర ప్రాంతాల్లో వజ్రాల కోసం వెదుకుతున్న వారితో సందడిగా మారింది.తొలకరి ప్రారంభం కావడంతో కర్నూలు జిల్లా పొలాల్లో వజ్రాల వెదుకులాట మొదలైంది. ఈ క్రమంలో వజ్రాలను వెదుకుతున్న వారిలో ఒకరికి అదృష్టం వరించినట్టు ప్రచారం జరిగింది. కర్నూలు జిల్లా మద్దికెర మండలంలోని పెరవలి కొల్లాపూర్ లక్ష్మీదేవి ఆలయం ప్రాంతంలో ఆదివారం ఒకరికి ఖరీదైన వజ్రం లభించినట్టు తెలుస్తోంద రంగు రాళ్లను వెదుకుతున్న క్రమంలో రూ.30 లక్షల విలువ చేసే వజ్రం దొరికినట్లు సమాచారం అందడంతో గ్రామానికి చెందిన ఒక వ్యాపారి పొలం వద్దకే వెళ్లి వజ్రాన్ని కొనుగోలు చేశారు. అప్పటికే ఆ సమాచారం ఊరంతా తెలిసిపోయింది. వజ్రం కొనుగోలు గురించి పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో దర్యాప్తు చేస్తున్నారు.పెరవలికి చెందిన ఓ రైతుకు ఆదివారం వజ్రం లభిం చగా రూ. లక్షన్నర రుపాయలు చెల్లించి ఓ వ్యాపారి కొనుగోలు చేశాడు. ఏటా వర్షాలు మొదలైన సమయంలో పొలాల్లో వజ్రాల అన్వేషణకు పెద్ద సంఖ్యలో స్థానికులు తరలి వస్తారు. అదృష్టం కలిసొస్తే క్షణాల్లో లక్షలు సంపాదించ వచ్చని ఎక్కడెక్కడి నుంచో కర్నూలుకు వస్తుంటారు.ఈ క్రమంలో జొన్నగిరి గ్రామంలో పొలం పనులు చేస్తున్న ఓ వ్యవసాయ కూలికి వజ్రం లభించింది. దానిని స్థానిక వ్యాపారి రూ. 1.50 లక్షలకు కొనుగోలు చేశాడు. జిల్లాలోని జొన్నగిరి, పగిడిరాయి, జి.ఎర్రగుడి, తుగ్గలి, రాంపురం గ్రామాల్లో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి జనం వచ్చి వర్షాకాలం ఎర్ర నేలల్లో వజ్రాన్వేషణ చేస్తుంటారు.ర్నూలు జిల్లాలోని తుగ్గలి, మద్దికెర, జొన్నగిరి, పగిడిరాయి, పెరవలి, మహానంది, మహాదేవపురం ప్రాంతాలకు ఏటా వజ్రాల వేట కోసం జనం తరలి వెళుతుంటారు. తొలకరి వర్షాలకు మట్టి కరిగినప్పుడు వజ్రాలు, విలువైన రంగురాళ్లు బయటపడటం ఎన్నో ఏళ్లుగా జరుగుతోంది. 2021లో ఒక రైతుకు రూ.1.2 కోట్ల విలువైన 30 క్యారట్ల వజ్రం దొరికిందని ప్రచారం జరిగింది. ఖరీదైన రాళ్లను కొనుగోలు చేసే వ్యాపారులు కూడా స్థానికంగా ఉన్నారు.

## సిల్వర్ స్క్రీన్ పై ట్విస్టుల మీద ట్విస్టులు

రాజమండ్రి, మే 27, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు సిల్వర్ స్క్రీన్ పై ట్విస్టుల మీద ట్విస్టులు కనిపిస్తున్నాయి. కామెడీతో పాటు కథ.. సాగతీత.. డైరెక్షన్ ఇలా ఒకటేమిటి.. ఏపీ రాజకీయాల్లో కావాల్సినంత సినిమా కనిపిస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది. ఎవరైనా సమ్మెకు ఎప్పుడైనా దిగే అవకాశముంది. అయితే అది తమ నేతకు సంబంధించిన సినిమా విడుదలయినప్పుడే ఈ థియేటర్లను మూసివేస్తూ నిర్ణయం తీసుకోవడం ఏంటన్న ప్రశ్న మాత్రం ఎవరికీ అర్థం కాకుండా ఉంది. పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు మూవీ వచ్చే నెల 12వ తేదీ విడుదలవుతున్న సందర్భంగా జూన్ ఒకటోతేదీ నుంచి సమ్మెకు దిగాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. నిజానికి థియేటర్లకు నష్టం వస్తున్నది జనాల రాక. జనాలు ఎందుకు వస్తున్నారన్న విషయం మాత్రంపై ఎగ్జిబిటర్లు ఇంత వరకూ దృష్టి పెట్టలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. సినిమాకు వెళితే టిక్కెట్ ధర వందల రూపాయలు ఉండగా, అంతకు మించి చిరుతిండ్ల ధరలు ఉండటం కూడా ప్రేక్షకులను థియేటర్లకు దూరం చేసిందనే చెప్పాలి. ఎటూ మూడు నెలల్లో ఓటీటీలోకి వస్తుందని భావించి అంత డబ్బును భరించలేక సినిమాను చూసేందుకు థియేటర్లకు కూడా రాలేకపోతున్నారు. పాప్ కార్న్ నాలుగు వందల రూపాయలా? సమోసా రెండు నూట నలభై రూపాయలా? ఈ రేట్లు బయట చూసుకుంటే ఇంత అబ్ నార్మల్ గా ఉన్నప్పటికీ ప్రభుత్వం కానీ, థియేటర్ల యాజమాన్యం కానీ పట్టించుకోవడం లేదు. మరొక వైపు ఇప్పుడు థియేటర్ల ఎగ్జిబిటర్ల నిర్ణయంతో ఇటు జనసేన అటు వైసీపీల మధ్య మాటల యుద్ధం ముదిరింది. ఎగ్జిబిటర్లు తమకున్న సమస్యలను చెప్పుకునే వీలుంది. అలాగే వాటిని పరిష్కరించాల్సింది డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు. అందుకే వారు తమ ప్లాట్ ఫారంలో చర్చించి నిర్ణయం తీసుకుని ఉండవచ్చు. కేవలం థియేటర్లను మూసివేస్తూ నిర్ణయం తీసుకుంటే పవన్ కల్యాణ్ సినిమాను దెబ్బ కొట్టినంత మాత్రాన నష్టపోయేది థియేటర్ల యజమానులే. ఆ విషయం వారికి కూడా తెలుసు. కానీ ఇది అటు ఇటు తిరిగి రాజకీయ రంగు పులుముకుంది

## విశాఖలో హాప్ ఆన్ హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులు

విశాఖపట్టణం, మే 27, విశాఖపట్నం వెళ్లాలనుకుంటున్నారా.. విశాఖ అందాలను ఒక్కరోజులో చుట్టిరావాలనుకుంటున్నారా.. అలాంటి వారికి గుడ్ న్యూస్. విశాఖకు వెళ్లే సందర్శకులతో పాటుగా, స్థానికులకు కూడా ఉపయోగకరంగా, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కీలక ఆలోచన చేస్తోంది. విశాఖలో హాప్ ఆన్ హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులను నడిపే ఆలోచన చేస్తోంది. ఈ మేరకు రెండు డబుల్ డెక్కర్ బస్సులో కొనుగోలు కోసం జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.విశాఖపట్నం వాసులకు, అలాగే విశాఖను సందర్శించే టూరిస్టులకు డబుల్ ధమాకా.. త్వరలోనే డబుల్ డెక్కర్ బస్సులు విశాఖ వీధుల్లో చక్కర్లు కొట్టనున్నాయి. విశాఖపట్నంలో కనెక్టివిటీని మెరుగుపరచడానికి, అలాగే పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు గానూ గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్.. హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సులను ప్రవేశపెట్టాలని ఆలోచిస్తోంది. పర్యాటకులతో పాటుగా స్థానికులకు కూడా సౌకర్యవంతమైన రవాణాను అందించేందుకు జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ఆలోచన చేస్తోంది. అందులో భాగంగా విద్యుత్తుతో నడిచే రెండు డబుల్ డెక్కర్ బస్సులను కొనుగోలు చేయాలని భావిస్తోంది. ఇందులో ఒకటి ఎయిర్ కండిషన్డ్ కాగా.. మరొకటి నాన్ ఏసీ డబుల్ డెక్కర్ బస్సు. ఈ మేరకు రెండు డబుల్ డెక్కర్ బస్సులను కొనుగోలు చేసేందుకు జీవీఎస్‌సీసీఎల్ ప్రతిపాదనలను కోరుతోందిఈ రెండు డబుల్ డెక్కర్ బస్సులను విశాఖపట్నంలోని అన్ని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాల మీదుగా నడపనున్నారు. పర్యాటక శాఖ భాగస్వామ్యంతో కలిసి ఈ ప్రాజెక్టు చేపట్టాలని జీవీఎంసీ ఆలోచిస్తోంది. విశాఖలోని ముఖ్యమైన ప్రదేశాలను చుట్టేసేలా ఈ బస్సులను తీసుకువస్తే పర్యాటకులకు మరింత అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఒక్కరోజులోనే విశాఖలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను చుట్టేయాలనుకునేవారికి ఈ హోహో డబుల్ డెక్కర్ బస్సులు అనుకూలంగా ఉంటాయి. తక్కువ ఖర్చుతో, సౌకర్యవంతమైన ప్రయాణంతో విశాఖ అందాలను ఆస్వాదించవచ్చు. అలాగే అటు స్థానికులకు కూడా ఉపయోగపడతాయి.హాప్ ఆన్ హాప్ ఆఫ్ విధానం వలన ప్రయాణికులు ఒకచోట బస్సు ఎక్కి, తమకు ఇష్టమైన ప్రదేశంలో దిగొచ్చు. అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించిన తర్వాత.. ఆ వెనుక వచ్చే బస్సులో తిరిగి ప్రయాణించే వీలుంటుంది. దీంతో తమకు ఇష్టమైన చోట దిగి.. మళ్లీ వెనుక వచ్చే బస్సులో ఖర్చు లేకుండా ప్రయాణించే వీలును ఈ హాప్ ఆన్ హాప్ ఆఫ్ విధానం కల్పి?స్తుంది. ఇక ఈ బస్సులు విద్యుత్ ఆధారంగా నడుస్తాయి. దీంతో పర్యావరణ కాలుష్యం ఉండదని అధికారులు చెప్తున్నారు. డబుల్ డెక్కర్ బస్సులు కావటంతో బస్సులో ప్రయాణిస్తూ అద్దాల మధ్య నుంచి విశాఖ అందాలను వీక్షించే అవకాశం కలుగుతుంది. ఈ బస్సులు అందుబాటులోకి వస్తే విశాఖలో ప్రైవేట్ వాహనాల వినియోగం తగ్గించేందుకు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు,విశాఖపట్నానికి మనదేశంలోని ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా సందర్శకులు వస్తుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా ఈ బస్సులను తేవాలని జీవీఎంసీ అధికారులు భావిస్తున్నారు.

## కడప మహానాడులో అతిధులను పలకరించనున్న గోదావరి ఆవకాయ ఘాటు

కడప,కడప టీడీపీ మహానాడు లో గోదావరి ఆవకాయ అతిధులను పలకరించాయి. ఇందుకోసం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ట్రక్కుల్లో కడపకు వేలాది పచ్చడి మామిడికాయలు తరలివెళ్లాయి. కొత్త అవకాయను సిద్ధం చేయటానికి మామిడి ముక్కలు కొట్టే వారిని, పచ్చడి పెట్టే వారిని సైతం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి దెందులూరు నుంచి కడపకు దెందులూరు ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. మహానాడు శిబిరం వద్ద ప్రారంభమైన కొత్త అవకాయ వంటకం ఏర్పాట్లను చింతమనేని స్వయంగా పర్యవేక్షించారు. కొత్త ఆవకాయ వంటకంలో చింతమనేని తో పాటు తాము సైతం అంటూ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి శ్రీ రాధాకృష్ణ చేయి కలిపారు. తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనే కార్యకర్తలకు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వంటకాల తయారీ, నాణ్యత, వడ్డింపు అంశాలను పర్యవేక్షించే భోజనాల నిర్వహణ కమిటీలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది.

# టీపీసీసీలో సామాజిక న్యాయం సాధ్యమా..

హైదరాబాద్, మే 27 (న్యూస్ పల్స్) తెలంగాణలో కుల గణన ఇటీవలే జరిగింది. ఇది దేశమంతటా అమలు చేయాలని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రతీ వేదికపైన "జిత్నీ ఆబాదీ, ఉత్నా హక్" (ఎంత జనాభా ఉంటే అంత హక్కు) కల్పించాలని ఆ పార్టీ అగ్రనేత , లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ ప్రవచిస్తున్న విషయం తెలిసిందే. అయితే తెలంగాణ సర్కార్ తమ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా కుల గణన విషయంలో రాకెట్ వేగంతో పని చేసింది. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపంది. తెలంగాణ మోడల్ అనుసరించి దేశ వ్యాప్తంగా జన గణన సమయంలోనే కుల గణన జరపాలని డిమాండ్ చేసింది. ముందు ససేమిరా అన్న ఎన్డీఏ ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణన చేస్తామని చెప్పి ఓ కొత్త రాజకీయ వ్యూహాన్ని ముందుకు తెచ్చింది. అయితే ఇప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మరో సాహసోపేతమైన నిర్ణయానికి సిద్ధమవుతుందా లేదా అన్న చర్చ సాగుతోంది. టీపీసీసీ కమిటీల నియామకంలో కుల గణనకు అనుగుణంగా కమిటీల కూర్పు ఉంటుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీలో ఉన్నారు. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్ చార్జ్ కేసీ వేణుగోపాల్ తో పీసీసీ కమిటీల కూర్పు, మంత్రి వర్గ విస్తరణపై చర్చలు జరుపుతున్నారు. అయితే ఇప్పుడు ఆ కమిటీలు రాహుల్ గాంధీ డిమాండ్ చేసినట్లు జనభా ప్రాతిపదికన ఉంటుందా , రాష్ట్రంలో కుల గణనకు అనుగుణంగా సామాజిక వర్గాల నేతలకు న్యాయం చేస్తారా లేదా అన్నదే ఇప్పుడు ముందున్న ప్రశ్నతెలంగాణ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు అనేది అప్పటి పరిస్థితులను బట్టి, ఆశావాహులను బట్టి, పార్టీలో అసంతృప్త నేతలను సంతృప్తి పరచాల్సి ఉంటుంది , ఈ కారణాలను బట్టి టీపీసీసీ స్వరూపం తరచూ మారూతూ ఉంటుంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు – ఇది తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించే అత్యంత కీలకమైన పదవి. ప్రస్తుతం బీసీ నాయకుడు అయిన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఈ పదవిలో కొనసాగుతున్నారు. వర్కింగ్ ప్రసిడెండ్ లేదా కార్యనిర్వాహక అధ్యక్షులు – పార్టీ అధ్యక్షుడికి పార్టీ కార్యక్రమాల్లో సహాయకారిగా ఉండేందుకు ఈ పదవిని ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం నలుగురు వర్కింగ్ ప్రసిడెంట్లను నియమిస్తున్నారు. ఇందులో పార్టీ సీనియారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ కోటాలను పరిగణలోకి తీసుకుని వర్కింగ్ ప్రసిడెంట్లను పార్టీ నియమిస్తుంది. వైస్ ప్రసిడెంట్స్ లేదా ఉపాధ్యక్షులు – టీపీసీసీలో వర్కింగ్ ప్రసిడంట్స్ తర్వాత కీలక పదవి ఇది. వీరు పార్టీ కార్యకలాపాల్లో కీలక పాత్ర వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు. అటు పీసీసీ చీఫ్ తో పాటు వర్కింగ్ ప్రసిడెంట్లతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను నిర్వర్తిస్తారు. దాదాపు 10 నుండి 20 మంది వరకు పార్టీ ఉపాధ్యక్షులుగా ఉండే అవకాశం ఉంది. సందర్భానుసారంగా ఈ సంఖ్య మారే అవకాశం ఉంది.పార్టీ జనరల్ సెక్రటరీస్ లేదా ప్రధాన కార్యదర్శులు – పార్టీలో మరో కీలకమైన పదవి ప్రధాన కార్యదర్శి పదవి. వీరు పార్టీలోని అంతర్గత, సంస్థాగత వ్యవహాలను చూస్తారు. ప్రతీ జిల్లా నుంచి ఇద్దరు ప్రధాన కార్యదర్శుల ఉండే అవకాశం ఉంది. ఆ జిల్లాను సమన్వయం చేయడానికి . ఇక హైదరాబాద్, రంగా రెడ్డి నుండి ఎక్కు మంది ప్రధాన కార్యదర్శులు ఉండే అవకాశం ఉంది. దాదాపు 80 మంది ప్రధాన కార్యదర్శులుగా ఉండే అవకాశం ఉంది. పార్టీ సెక్రటరీస్ లేదా కార్యదర్శులు – పార్టీ ఇచ్చే కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో వీరు కీలకంగా పని చేస్తారు. క్షేత్ర స్థాయిలో అటు ప్రజలు, ఇటు పార్టీ కార్యకర్తలతో కలిసి పని చేస్తారు. పార్టీ తీసుకునే నిర్ణయాలను వీరు అమలు చేస్తారు. దాదాపు 40 మందిని ఈ పదవుల్లో నియమించే అవకాశం ఉందిపార్టీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్స్ లేదా పార్టీ అధికార ప్రతినిధులు – వీరు పార్టీ తీసుకున్న నిర్ణయాలను, పార్టీ కార్యక్రమాలను, ఆయా అంశాలపై పార్టీ తీసుకునే స్టాండ్ ను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తారు. వీరు దాదాపు ఐదు నుండి పది మంది ఉండే అవకాశం ఉందిపార్టీ క్యాంపెయిన్ కమిటీ లేదా ప్రచార కమిటీ – ఈ కమిటీ పార్టీ కి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను రూపొందించడం, వాటిని అమలు చేయడం ప్రధాన విధి. ఇది ఎన్నికల అవసరాలను బట్టి ప్రచార కమిటీ సభ్యుల సంఖ్య మారుతూ ఉంటుంది.డిసిప్లినరీ యాక్షన్ కమిటీ లేదా క్రమ శిక్షణ కమిటీ – ఇది పార్టీ సభ్యులు, పార్టీ నియమాలకు అనుగుణంగా ఉండేలా చూస్తుంది. ఎవరైనా పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే ఆ సభ్యులను విచారిస్తుంది. తప్పని తెలితే తీసుకోవాల్సిన క్రమ శిక్షణ చర్యలను పార్టీ అధ్యక్షునికి సిఫారసు చేస్తుంది. ఇందులో పార్టీలోని సీనియర్లను నియమిస్తారు. దాదాపు 7గురి వరకు అవకాశం కల్పించ వచ్చు.ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ రూపొందించిన దేశ వ్యాప్త కార్యక్రమాలు లేదా ప్రచార కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేసేలా చూస్తుంది. ఏఐసీసీ చేసే సూచనలను, ఆదేశాలను పార్టీలోను, రాష్ట్రంలో పార్టీ తరపున అమలు చేసే కమిటీ. ఏఐసీసీకి, రాష్ట్ర పార్టీకి మధ్య అనుసంధాన కర్తగా ఈ కమిటీ పని చేస్తుంది.రాజకీయ వ్యవహారాల కమిటీ (పొలిటికల్ అఫైర్స్ కమిటీ ) – ఈ కమిటీలో పార్టీ సీనియర్ నేతలు సభ్యులుగా ఉంటారు. వీరు పార్టీకి సంబంధించి రాష్ట్రంలో తీసుకోవాల్సిన రాజకీయ నిర్ణయాలను ఈ కమిటీ తీసుకుంటుంది. అవసరమైన సలహాలు సూచనలను పార్టీకి అందిస్తుంది. ఈ కమిటీలతో పాటు చేరికల కమిటీ, ఎన్నికల సమయంలో పార్టీ మ్యానిఫెస్టో తయారు చేసే కమిటీల వంటి?వి ఉంటాయి. ఇక క్షేత్ర స్థాయిలో జిల్లా కమిటీలు, బ్లాక్, మండల, గ్రామ కమిటీలు ఉంటాయి. కార్మిక, రైతు, విద్యార్థి , యువత, మహిళ, మైనార్టీ వంటి అనుబంధ కమిటీలు ఉంటాయి. ఈ కమిటీల కూర్పు పార్టీ సీనియారిటీ, వారి పని తీరు, కుల సమీకరణలను బట్టి జరుగుతుంది.

# కవిత కండిషన్స్...



హైదరాబాద్, మే 27 (న్యూస్ పల్స్) బీఆర్ఎస్ పార్టీలో కవిత కొనసాగుతారా? లేక తన దారి తాను చూసుకుంటారా? అన్న అంశం ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. తాను తండ్రికి రాసిన లేఖను కొందరు కావాలనే బయట పెట్టారని కవిత బహిరంగంగానే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తన తండ్రి కేసీఆర్ దేవుడని.. కానీ కొందరు దెయ్యాలు ఆయన చుట్టూ ఉన్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు కవిత. తద్వారా పార్టీలో కీలక స్థానాల్లో ఉన్న కొందరితో కవితకు పడడం లేదని స్పష్టం అవుతోంది. ఇదిలా ఉంటే.. తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కవిత కొన్ని కండిషన్లు పెట్టినట్లు తెలుస్తోంది. వాటికి ఒప్పుకోకుంటే తనదారి తాను చూసుకుంటానని స్పష్టం చేసినట్లు మీడియా కథనాలు వస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ ఈ మేరకు జోరుగా ప్రచారం సాగుతోంది. ఆయా కథనాల ప్రకారం కేసీఆర్ కు కవిత పెట్టిన 6 కండిషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.తనకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కేసీఆర్ వద్ద కవిత డిమాండ్ పెట్టినట్లు మీడియా కథనాలు వస్తున్నాయి. వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా అందుకు సమానమైన హోదా ఇవ్వాలని ఆమె కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ కండిషన్ కు ఒప్పుకోకుంటే తాను పార్టీలో కొనసాగేదే లేదని ఆమె స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. తనను జైలుకు పంపించి.. ఇబ్బందులు పెట్టిన బీజేపీతో ఎప్పటికీ పొత్తు పెట్టుకోవద్దని కేసీఆర్ కు కవిత స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు వివిధ వేదికలపై కేసీఆర్ తో పాటు ముఖ్య నేతలు స్పష్టం చేయాలని ఆమె కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కేసీఆర్ కు రాసిన లెటర్లోనూ బీజేపీతో పొత్తు ఉంటుందని బయట ప్రచారం జరుగుతున్న విషయాన్ని కవిత ప్రస్తావించిన విషయం తెలిసిందే. తాను కేసీఆర్ కు రాసిన లేఖ ఎలా బయటకు వచ్చిందో చెప్పాలని పార్టీని కవిత డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిన్న కేసీఆర్ ఫామ్ హౌజ్ లో ఉన్న ఇద్దరు, ముగ్గురు ముఖ్య నేతలతో కవిత మాట్లాడినట్లు మీడియా కథనాలు వస్తున్నాయి. లీక్ చేసిన వారి పేర్లు బయటపెట్టాలని.. వారిపై చర్యలు తీసుకోవాలని కవిత స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. అప్పటి వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటానని ఆమె చెబుతున్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.2018 అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్లోని 7 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులే విజయం సాధించారు. అనంతరం కొన్ని నెలల్లోనే జరిగిన ఎంపీ ఎన్నికల్లో మాత్రం కవిత ఓటమి పాలయ్యారు. అయితే.. కొందరు ఎమ్మెల్యేల వెన్నుపోటు కారణంగానే తాను ఓటమి పాలయ్యానన్నది కవిత వాదన. వీరిలో కొందరిపై చర్యలు తీసుకోవాలని ఆ సమయంలోనే కేసీఆర్ ను కోరినా సీరియస్ గా తీసుకోలేదని కవిత వాపోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా వారిని నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతల నుంచి తప్పించి కొత్త వారికి అప్పగించాలని కవిత డిమాండ్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో తాను సూచించిన వారికే నియోజకవర్గ ఇన్ఛార్జి పదవులు ఇవ్వాలని కవిత డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కొన్ని సెగ్మెంట్ల బాధ్యతలను సైతం కూడా తాను సూచించిన వారికే అప్పగించాలన్నది కవిత డిమాండ్ గా తెలుస్తోంది.

# ఆధార్ ఈ-సిగ్నేచర్ సిస్టమ్

నల్గొండ, మే 27, తెలంగాణలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాజాగా మరో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆధార్-ఈ సంతకం విధానం అమలు చేయనుంది. తొలుత ఆర్మూర్, కూసుమంచి కార్యాలయాల్లో ఆధార్ -ఈ సంతకం అమలు కానుంది.అవినీతిరహితంగా, పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో.. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ -ఈ సంతకం విధానాన్ని కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువరావాలని.. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశివంచారు. ఈ ఆధార్-ఈ సంతకం వల్ల 10 నుంచి 15 నిముషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు సచివాలయంలోని తన కార్యాలయంలో.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి.. స్లాట్ బుకింగ్ విధానం, పనిభారం అధికంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్‌ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగ్‌లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్లాట్ బుకింగ్‌తోపాటు.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా.. ఆధార్-ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే అమల్లోకి తీసుకువస్తున్నామని వెల్లడించారురాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో.. ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పొంగులేటి అధికారులకు సూచించారు. పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్‌ఆర్‌వోలను నియమించారు. అవినీతి లేకుండా.. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ.. ప్రభుత్వ పేరు ప్రతిష్టలు పెంచే విధంగా సబ్ రిజిస్ట్రార్‌ల పనితీరు ఉండాలని శ్రీనివాస రెడ్డి సూచించారురిజిస్ట్రేషన్ల వ్యవస్థలో తెలంగాణ ప్రభుత్వం.. స్లాట్ బుకింగ్ విధానం తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 47 చోట్ల విజయవంతంగా అమలు కావటంతో... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కార్యాలయాల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేయనున్నారు. ప్రయోగాత్మకంగా మొదటి దశలో ఏప్రిల్ 10వ తేదీన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. మంచి ఫలితాలు రావడంతో మే 12వ తేదీ నుంచి 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేశారు. ఈ రెండు విడతలు కలిపి.. 47 చోట్ల అమలు చేసిన విధానం విజయవంతమైందని మంత్రి పొంగులేటి వివరించారు.

# ఇక మంచిర్యాలకు పరుగులు..


అదిలాబాద్, మే 27, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ప్రయాణాన్ని సులభతరం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్-కరీంనగర్-రామగుండం రహదారి (హెచ్‌కేఆర్ రోడ్డు), లేదా రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా కొత్త గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నూతన రహదారికి సంబంధించి మూడు ప్రతిపాదనలు సిద్ధం కాగా.. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఒక ప్రతిపాదనకు సూత్రప్రాయ ఆమోదం లభించింది.ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న 207 కిలోమీటర్ల నాలుగు వరుసల రాజీవ్ రహదారి ప్రైవేటు కాంట్రాక్టర్ ఆధీనంలో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010లో పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానంలో ఈ రోడ్డు నిర్మాణం, నిర్వహణ కోసం ఒక సంస్థకు 25 ఏళ్ల కాలానికి (2036 ఫిబ్రవరి 14 వరకు) అప్పగించారు. ఈ సంస్థ టోల్ వసూలు, రోడ్డు నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుంది. అయితే.. కాలక్రమేణా వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో.. ఈ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య అధికమైంది.ముఖ్యంగా జూబ్లీ బస్ స్టాండ్ నుంచి శామీర్‌పేట వరకు.. ఆ తర్వాత మంచిర్యాల వరకు ప్రయాణం కష్టతరంగా మారింది. అంతేకాకుండా.. ఈ రోడ్డులో ఉన్న మలుపుల కారణంగా ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత రోడ్డుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్‌అండ్‌బీ అధికారులు మూడు ప్రతిపాదనలను ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో వివరించారు. ఈ ప్రతిపాదనల్లో మూడో ప్రతిపాదనకు సీఎం సూత్రప్రాయ ఆమోదం తెలిపారు.మొదటి ప్రతిపాదనల్లో.. ప్రస్తుత రోడ్డుకు ఎడమవైపున 188 కిలోమీటర్ల దూరంతో ఉండే ఈ మార్గం శామీర్‌పేట నుంచి మొదలై తుర్కపల్లి, వర్గల్, దుబ్బాక, హరిదాసనగర్, కోనాయిపల్లి, దాతోజీపేట, అంతర్గాం మీదుగా మంచిర్యాల దగ్గరున్న ఎన్‌హెచ్-63కి అనుసంధానమవుతుంది. ఈ మార్గంలో శామీర్‌పేట చెరువు, అప్పర్ మానేరు డ్యామ్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల పరిధిలో నిర్మాణం చేపట్టాల్సి ఉన్నందున నిర్మాణ వ్యయం రూ. 4,700 కోట్లు అవుతుందని అంచనా.ప్రతిపాదనల్లో.. ఇది శామీర్‌పేట నుంచే ప్రారంభమై నారాయణపూర్, ఎర్రవల్లి, తిమ్మాపూర్, కొమురవెల్లి, అంకుశాపూర్, నగునూర్, బస్వాపూర్, నవాబ్‌పేట, చిగురుమామిడి, తడికాల, మానేరు రివర్ క్రాసింగ్, కొలనూర్, వెన్నంపల్లి, ఏదులాపురం, లక్కారం నుంచి పుట్టపాక, కిస్టాపూర్, శ్రీరాంపూర్ మీదుగా మంచిర్యాల దగ్గరున్న ఎన్‌హెచ్-63కి కలుపుతారు. గ్రీన్‌ఫీల్డ్ విధానంలో 160 కి.మీ., జాతీయ రహదారుల అనుసంధానంగా మరో 46 కి.మీ. నిర్మాణం ఉంటుంది. ఈ మార్గంలో కొంతమేర అటవీ భూమి కావాల్సి ఉండగా, నిర్మాణానికి రూ. 4,000 కోట్లు అవసరమని పేర్కొన్నారు.మూడో ప్రతిపాదనలో.. ఈ మార్గం శామీర్‌పేట నుంచి మొదలై నారాయణపూర్, కొమురవెల్లి దగ్గర ఎన్‌హెచ్-365బీ వరకు ఆప్షన్-2లో ఉన్న విధంగానే ఉంటుంది. ఆ తర్వాత చేర్యాల దగ్గరి నుంచి భైరాన్‌పల్లి, కన్నారం, ముల్కనూర్, ఎల్కతుర్తి, కమలాపూర్, మర్రిపల్లిగూడెం, టేకుమట్ల.. ఆ తర్వాత మానేరు డ్యామ్ క్రాస్ అయి ముత్తారం, పుట్టపాక, కిస్టాపూర్, శ్రీరాంపూర్ మీదుగా మంచిర్యాలకు దగ్గర్లోని ఎన్‌హెచ్-63కి కలుపుతారు.దీని నిర్మాణానికి రూ. 3,000 కోట్ల నిధులు కావాల్సి ఉంటుందని అంచనా. ఈ మూడు ఆప్షన్లలో ఇదే ఉత్తమంగా ఉందని అధికారులు పేర్కొనడంతో సీఎం దీనికి సూత్రప్రాయ ఆమోదం తెలిపారు. మంచిర్యాల వరకు నిర్మించబోయే ఈ రోడ్డును భవిష్యత్తులో నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు పలు భాగాలుగా నిర్మితమవుతున్న జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నారు. ఇది తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య రవాణాను మెరుగుపరుస్తుంది..

## తెలుగు ప్రజల ఆరాధ్య నటుడు, నాయకుడు నందమూరి తారక రామరావు.

### -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

రాముడు, కృష్ణుడు, రావణుడు, దుర్యోధనుడు లాంటి పౌరాణిక పాత్రల్లో నటించి తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన యుగపురుషుడు ఎన్‌టిఆర్. జానపదం, సాంఘికం, పౌరాణికం అనే తేడా లేకుండా అన్ని పాత్రల్లో జీవించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు కృష్ణా జిల్లా నిమ్మకూరులో 1923 మే 28న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మయ్య చౌదరి, వెంకట రామమ్మ.ఎన్‌టిఆర్ పాఠశాల విద్య విజయవాడ మున్సిపల్ హై స్కూల్‌లో పూర్తి చేసి ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో చేరాడు. కళాశాల విద్య కొనసాగుతుండగానే మేనమామ కూతురు బసవ తారకంను వివాహమాడి గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీలో బిఎ చేశారు. ఎన్‌టిఆర్‌కు మొదటి నుంచి నాటక రంగంపై మక్కువ ఎక్కువ. విజయవాడ ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో చదువుతున్నప్పుడు నాగమ్మ పాత్ర వేశారు. నూనూగు మీసాలు తీసేందుకు ససేమిరా అనడంతో ఆ పాత్రకు మీసాల నాగమ్మ అని పేరు తగిలించారు. గుంటూరు క్రిస్టియన్ కళాశాలలో చదువుతున్నప్పుడు నేషనల్ ఆర్ట్ థియేటర్‌ను ఏర్పాటు చేసి జగ్గయ్య, ముక్కామల, నాగభూషణం తదితరులతో ''చేసిన పాపం'' వంటి నాటకాలు ఆడారు.



సినిమా రంగంపై మక్కువతో మంగళగిరిలో సబ్ రిజిస్ట్రార్‌గా చేస్తోన్న ఎన్‌టిఆర్ చెన్నై ట్రేన్ ఎక్కేశారు. తొలి అవకాశం 'పల్లెటూరి పిల్ల' సినిమాకు వచ్చినా విడుదలైంది మాత్రం 'మనదేశం' చిత్రం. షావుకారు చిత్రం తరువాత నివాసాన్ని చెన్నై థౌజండ్ లైట్స్ ప్రాంతానికి మార్చుకున్నారు. విజయావారి బ్యానర్‌పై వచ్చిన పాతళభైరవి, మల్లీశ్వరి, పెళ్లిచేసి చూడు, చంద్రహారం చిత్రాలు ఎన్‌టిఆర్‌ను తిరుగులేని నటుడిగా నిరూపించాయి. మాయాబజార్, లవకుశ, శ్రీకృష్ణార్జున యుద్ధం, భీష్మ, భూకైలాష్, నర్తనశాల, పాండవ వనవాసం, శ్రీ వెంకటేశ్వరస్వామి మహత్యం, మహామంత్రి తిమ్మరుసు, దానవీరశూరకర్ణ చిత్రాలు విశ్వ విఖ్యాత ఎన్‌టిరామారావును మకుటం లేని మహారాజుగా నిలబెట్టాయి. కన్యాశుల్కం, గుండమ్మకథ, అడవిరాముడు, వేటగాడు, గజదొంగ, డ్రైవర్ రాముడు, సర్దార్ పాపారాయుడు, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి, బొబ్బిలిపులి చిత్రాల్లో ఆయన విలక్షణ నటనను ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోరు. ఎన్‌టిఆర్ నటించిన చివరి చిత్రం మేజం. తన కెరీర్లో ఆయన దాదాపు 320కి పైగా చిత్రాల్లో నటించారు.

# రెండు ముక్కలుగా గ్రేటర్ హైదరాబాద్

హైదరాబాద్, మే 27 )గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను రెండు ముక్కలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనివల్ల అభివృద్ధి ఈజీ అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ మహానగరాన్ని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.అందులో భాగంగా ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధి దాదాపు 625 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్నది. ఇక మిగిలిన మున్సిపాలిటీలను వీలినం చేస్తే జీహెచ్ఎంసీ పరిధి 2వేల చదరపు కిలోమీటర్లకు పెరుగుతుంది. అప్పుడు దేశంలోనే అతిపెద్ద నగరంగా హైదరాబాద్ నిలుస్తుంది. అప్పుడు ఓఆర్ఆర్ వరకు ఉన్న నగరాన్ని ఒక్కటే కార్పొరేషన్ గా ఉంచడమా లేక రెండు భాగాలుగా విభజించడమా అనే విషయంలో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అయితే పరిపాలన సౌలభ్యం కోసం రెండు భాగాలుగా చేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై ఢిల్లీ, ముంబై నగరాల విస్తీర్ణం, ఆ కార్పొరేషన్లు పనిచేసే తీరుపై అధ్యయనం చేయడానికి ఒక బృందం అయా నగరాల్లో పర్యటించేందుకు సిద్ధమైంది. కాగా ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం దాదాపు ఖరారు అయినప్పటికీ మొత్తాన్ని ఒక కార్పొరేషన్ గా ఉంచడమా? లేక రెండుగా విభజించడమా అనేదానిపై చర్చ సాగుతోంది. ఇక మున్సిపాల్ ఎన్నికల కోసం ఓఆర్ఆర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లో డిలిమిటేషన్ (వార్డుల పునర్విభజన) చేమాలని ప్రభుత్వం భావిస్తోంది. దానిలో భాగంగా ఇప్పటికే ఆ ప్రక్రియను మొదలు పెట్టింది. అయితే ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మాత్రం గ్రేటర్ పరిధిలోకి తెచ్చే ఉద్దేశంతో అక్కడ ఎలాంటి డిలిమిటేషన్ మొదలు పెట్టలేదు. మరోవైపు ఓఆర్ఆర్ పరిధిలో, ఓఆర్ఆర్ బయట ఒకే విధమైన అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కు వేర్వేరుగా ఇద్దరు కార్యదర్శులను నియమించారు.గ్రేటర్ ను విస్తరించడంలో భాగంగానే ఇద్దరు సెక్రటరీలను నియమించినట్లు తెలుస్తోంది. ఓఆర్ఆర్ వెంట ఉన్న 51 గ్రామాలను ఓఆర్ఆర్ లోపలి మున్సిపాలిటీల్లో కలుపుతూ గతేడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రేటర్ విస్తరణ తప్పదనే సంకేతాలు ఇచ్చినట్లయింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 158 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో ఓఆర్ఆర్ లోపల 28 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు.. ఓఆర్ఆర్ కు, ఆర్ఆర్ఆర్ కు మధ్య 18 మున్సిపాలిటీలు వాటి అవతల మొత్తం 130 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. అయితే ఢిల్లీని 2012లో పరిపాలన సౌలభ్యం కోసమని నార్త్, సౌత్, ఈస్ట్ అని మూడు భాగాలుగా విభజించి మూడు కార్పొరేషన్లుగా ప్రటించారు. అయితే ఆ తర్వాతా 2022లో తిరిగి మూడింటిని ఒకే కార్పొరేషన్ కిందకు తీసుకువచ్చారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ విస్తీర్ణం ప్రస్తుతం 1,400 చదరపు కీలోమీటర్లు. దీనివల్ల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలు, పారిశుధ్య నిర్వహణ వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. మరొవైపు నగర విస్తీర్ణం వల్ల అభివృద్ధి త్వరిత గతిన సాగుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడాతాయన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే హైదరాబాద్ నగరం , ఢిల్లీ ని ఒకే రీతిన చూడలేమని, దేశానికి ఢిల్లీ రాజధాని కావడంతో పాటు ఓఆర్ఆర్ వరకు ఉన్న హైదారాబాద్ ను చూస్తే అది ఢిల్లీ తక్కువ విస్తీర్ణంలో ఉంటుంది. కనుక గ్రేటర్ హైదరాబాద్ ను రెండు భాగాలుగా విభజిస్తే పారిపాలన సౌలభ్యానికి మంచిదన్న అభిప్రాయం ఉంది. మొత్తాన్ని రెండుగా విభజించడం రెండు ఒకేలా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా త్వరలోనే ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# కాఫీ తాగడం మానేస్తున్నారా? ఒక్కసారిగా మీ శరీరంలో కలిగే మార్పులు ఇవే!



చాలా మందికి కాఫీ లేకుండా రోజు మొదలవుతుందని చెప్పొచ్చు. ఉదయాన్నే కాఫీ తాగడం చాలామందికి ఒక అలవాటు, కొందరికి అయితే అదొక నిత్యక్రియ. కెఫీన్ మనల్ని ఉత్సాహంగా ఉంచుతుంది, మనస్సును చురుకుగా చేస్తుంది. కాఫీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు కొన్ని అనర్థాలూ ఉన్నాయి. కాఫీని మానేస్తే మన ఆరోగ్యంపై చాలా ప్రభావం ఉంటుంది. అయితే, కాఫీ తాగడం పూర్తిగా మానేయాలనుకుంటే మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి, కానీ దీర్ఘకాలంలో కొన్ని గణనీయమైన మార్పులు కూడా కనిపిస్తాయి. 1. శరీరంలో డిటాక్స్ ప్రక్రియ: కాఫీ తాగడం మానేయడం వల్ల కెఫిన్‌ను శరీరం పూర్తిగా వదిలించుకుంటుంది. ఇది డిటాక్స్‌కు సహాయపడుతుంది. కాఫీ అనేది సహజంగా డీహైడ్రేషన్ కారణం కావడంతో, కాఫీ మానేయడం వల్ల శరీరానికి తగినంత నీరు అందుతుంది. " కాఫీ తాగడం వల్ల ఇన్ని నష్టాలున్నాయా..?" 2. నిద్రలో మెరుగుదల: కాఫీలోని కెఫిన్ నిద్రను ప్రభావితం చేస్తుంది. కాఫీని మానేయడం వల్ల నిద్ర గుణాత్మకంగా మెరుగవుతుంది. కాఫీ తీసుకునే వారు తరచుగా నిద్రలో ఆటంకం ఎదుర్కొంటారు. కాఫీ మానేయడం వల్ల నిద్రనక దృఢమైన స్థితి లభిస్తుంది. మరింత ప్రశాంతంగా నిద్రపోవచ్చు. 3. మానసిక ఉద్రిక్తత తగ్గడం: కాఫీ మానేయడం వల్ల కొంతమంది మానసిక శాంతిని పొందుతారు. అధిక కాఫీ సేవనం ఎంజైటీని పెంచుతుంది. కాఫీని మానేసిన తర్వాత మానసిక ఒత్తిడి తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కొంతమందిలో కాఫీ ఆందోళనను పెంచుతుంది. కాఫీ మానేస్తే, ఆందోళన తగ్గే అవకాశం ఉంది. 4. తక్కువ గుండె స్పందన: కాఫీ తీసుకునే వారిలో గుండె స్పందన ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కాఫీ మానేయడం వల్ల గుండె స్పందన సాధారణ స్థితికి చేరుకోవచ్చు. కొంతమందికి కాఫీ తీసుకోవడం వల్ల ఆమ్లత్వం (ఆసిడిటీ), గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఉంటాయి. దీనిని మానేయడం ద్వారా ఇలాంటి సమస్యలు తగ్గుతాయి. " రాత్రిపూట టీ తాగితే ఏమౌతుందో తెలుసా..?" 5. మూడ్ స్వింగ్‌లకు ఎదురయ్యే అవకాశం: కాఫీ మానేసిన కొద్ది రోజులు మూడ్ స్వింగ్‌లు రావచ్చు. ఇది కాఫీకి అలవాటు పడిన శరీరం ఆ అలవాటు విడిచిపెట్టే ప్రక్రియలో ఉండటం వల్ల జరుగుతుంది. కాఫీ మానేసినప్పుడు శరీరం సహజంగా అలసట అనుభూతి చెందుతుంది. ఇది శరీరం కాఫీ లేకుండా సహజ స్థాయిలో ఎడ్జస్ట్ అవుతున్న సూచన. కొద్ది రోజుల్లో ఇది సాధారణ స్థితికి వస్తుంది. కాఫీ మానేయడం వల్ల మొదట్లో కొన్ని ప్రతికూలతలు ఉండవచ్చు కానీ, దీర్ఘకాలంలో శరీరానికి ఆరోగ్యకరమైన మార్పులు కనిపిస్తాయి. కాఫీని మానేయాలని అనుకునే వారు దీనిని శ్రద్ధగా, స్థిరంగా ప్లాన్ చేసుకోవడం ఉత్తమం

# పొద్దుతిరుగుడు గింజల్లో దాగున్న ఆరోగ్య రహస్యాలు!

మనకు ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే వాటిల్లో పొద్దుతిరుగుడు గింజలకు ఒక మంచి స్థానం ఉంది. పొద్దు తిరుగుడు గింజల్లో క్యాలరీలు, ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు, మినరల్స్, ఆరోగ్యకరమైన కొవ్వు, పిండి పదార్థాలు, ఫైబర్ ఉంటాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల వచ్చే నష్టాలనుండి మన శరీరాన్ని కాపాడుతుంది. పొద్దు తిరుగుడు గింజలతో గుండె ఆరోగ్యం పొద్దుతిరుగుడు విత్తనాలలో బి విటమిన్ సమృద్ధిగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో థయామిన్, రిబోఫ్లావిన్, నియాసిన్ ఉంటాయి. ఇవి మన శరీరాన్ని అనేక విధాలుగా రక్షిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలు ముఖ్యంగా మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తనాళాలలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో పొద్దుతిరుగుడు గింజలు కీలక భూమిక పోషిస్తాయి. "హబీనిబప్త్రతినివ ఎతిబిజీఎతిని: సన్‌షైన్ విటమిన్ గురించి మీకు తెలుసా..? ఎప్పుడు, ఎలా లభిస్తుందంటే.." పొద్దు తిరుగుడు గింజలతో యవ్వనంగా పొద్దుతిరుగుడు గింజల్లో విటమిన్ ఈ పుష్కలంగా ఉండడం వల్ల ఇది మన శరీరంలో కోల్పోతున్న కొలాజిన్ ఉత్పత్తికి దోహదం చేసి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పొద్దుతిరుగుడు గింజలను నిత్యం తీసుకుంటే చర్మం నిగారింపు సంతరించుకుంటుంది. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే ప్రోటీన్, ఫైబర్ కారణంగా మన కడుపు నిండుగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. ఇది మనను అతిగా తినడం నుండి నివారిస్తుంది. ఫలితంగా మనం ఆరోగ్యకరంగా బరువు తగ్గే అవకాశం కలుగుతుంది. పొద్దు తిరుగుడు గింజలతో ఎముకల ధృడత్వం పొద్దుతిరుగుడు గింజలలో ఉండే విటమిన్ ఈ తోపాటు, యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా మన కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మనల్ని ఒత్తిడి నుంచి కాపాడుతుంది. పొద్దుతిరుగుడు గింజల్లో మెగ్నీషియం, కాల్షియం, మరియు కాపర్ పుష్కలంగా ఉండడం వల్ల ఇది ఎముకల



బలాన్ని పెంచుతుంది. ఎముకలు దృఢంగా ఉండేలా చేస్తుంది. జీర్ణ వ్యవస్థకు, డయాబెటిస్ కంట్రోల్ కు బెస్ట్ ఫుడ్ పొద్దు తిరుగుడు గింజల్లో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ కారణంగా మన మెదడు పనితీరు మెరుగుపడుతుంది. ఇది మన బ్రెయిన్ ఫంక్షన్ కు ఎంతగానో దోహదం చేస్తుంది. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే డైటరీ ఫైబర్ కారణంగా మన జీర్ణ క్రియ మెరుగుపడుతుంది. మన జీర్ణ వ్యవస్థకు ఇది ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఇవి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. "పొట్లకాయ తిన్న తర్వాత తినకూడని ఆహారాలు.. పొరపాటున తిన్నారో..?" పొద్దు తిరుగుడు గింజలతో ఈ సమస్యలకు చెక్ పొద్దుతిరుగుడు గింజలలో ఉండే పోషకాలు పురుషుల పునరుత్పత్తి ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. ఇక మహిళలలో కూడా మూడ్ స్వింగ్స్, రుతుక్రమ సమస్యలను తగ్గించడంలో దోహదం చేస్తాయి. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్రీ రాడికల్స్ మనల్ని క్యాన్సర్ నుండి కాపాడతాయి. మన జుట్టు ఆరోగ్యాన్ని కూడా పొద్దు తిరుగుడు గింజలు మెరుగుపరుస్తాయి. అయితే పొద్దుతిరుగుడు గింజలను ఎక్కువ మోతాదులో తినడం మంచిది కాదు. దీనివల్ల అనేక ఇబ్బందులు రావచ్చు.

# సన్‌షైన్ విటమిన్ గురించి మీకు తెలుసా..? ఎప్పుడు, ఎలా లభిస్తుందంటే..

శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో విటమిన్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. రోగనిరోధక శక్తిని అందించడంతో పాటు శరీర పనితీరుకు మద్దతిస్తాయి. మనకు పలు రకాల విటమిన్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా విటమిన్లను శరీరంలోకి పంపిచవచ్చు. అయితే విటమిన్ ఆ ఇతర వాటికి కొంత భిన్నంగా ఉంటుంది. విటమిన్ ఆ ని సన్‌షైన్ విటమిన్ గా కూడా పిలుస్తారు. శక్తివంతమైన ఎముకలు, రోగనిరోధక వ్యవస్థ మద్దతుతో పాటు శరీర సమగ్ర ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ ముఖ్యమైన పోషక పదార్థం కాల్షియం మరియు ఫాస్ఫరస్‌ను శరీరం గ్రహించడంలో సహాయపడుతుంది. ఇవి ఎముకల ఆరోగ్యం మరియు కండరాల పనితీరు కోసం అత్యంత అవసరమైనవి. "చలి




పెరుగుతోంది.. చర్మాన్ని పొడిబారకుండా రక్షించుకోండిలా!" సూర్యకాంతి విటమిన్ ఆకి సహజ మూలం. శరీరానికి సూర్యరశ్మికి తగిలినప్పుడు చర్మం ద్వారా విటమిన్ ఆ ఉత్పత్తి అవుతుంది. చర్మం రకం మరియు భౌగోళిక ప్రదేశం ఆధారంగా వారానికి కొన్ని సార్లు 10-30 నిమిషాల పాటు శరీరం సూర్యకాంతిని సంగ్రహించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. విటమిన్ ఆ తగినంత స్థాయిలో ఉంటేనే ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే రోగ నిరోధక వ్యవస్థను కూడా పూర్తిగా పనిచేయగలుగుతుంది. అయితే ఎప్పుడు పడితే అప్పుడు ఎండలో నిలబడటం వల్ల ఉపయోగం ఉండదు సరికదా చర్మం అనారోగ్యం పాలవుతుంది. ఉదయం లేదా సాయంత్రం వేళ జు఺ కిరణాల ప్రభావం తక్కువగా ఉన్న సమయం మంచిదిగా భావించవచ్చు. ఉదయం 8 లోపు లేదా సాయంత్రం 4 తర్వాత సూర్య కాంతి శరీరానికి తగిలేలా ఎండలో గడపవచ్చు. దీంతో దాన్ని శరీరం గ్రహించి విటమిన్ ఆని తయారు చేసుకుంటుంది. అలా తయారు చేసుకున్న విటమిన్‌ను పలు అవసరాలకు ఉపయోగించుకుంటుంది. రేణూదేశాయ్ చేసిన మంచిపని.! పవన్ కళ్యాణ్ కు మరాఠీ నేర్పిన మాజీ భార్య.! ।ానివతినిటతిజీ ఽవశ్రీబీణబీ అంతేకాకుండా పలు ఆహార పదార్థాల్లో కూడా విటమిన్ ఆ సమృద్ధిగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సాల్మన్ మరియు ట్యూనా వంటి కొవ్వు కలిగిన చేపలు, కోడ్ లివర్ ఆయిల్‌లో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది. వీటితో పాటు పాలు, నారింజ రసం, మరియు సీరియల్స్ వంటి ఫోర్టిఫైడ్ ఆహారాలు కూడా విటమిన్ ఆను శరీరానికి అందిస్తాయి. ముఖ్యంగా తగినంత సూర్యరశ్మి లభించని వారికి ఇవి సహాయపడతాయి.

# ఖాళీ కడుపుతో ఈ ఒక్కజ్యూస్ తాగితే చాలు.. ఫ్యాట్ మొత్తం కరిగిపోవాల్సిందే!



గోధుమ గడ్డి జ్యూస్‌ను ఆరోగ్యానికి మేలునిచ్చే "సూపర్ ఫుడ్"గా భావిస్తారు. ఎందుకంటే ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ జ్యూస్ పలు పోషకాలతో నిండి ఉండటమే కాకుండా, శరీరాన్ని శక్తివంతంగా శుభ్రపరచే సహజ మార్గాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఖాళీ కడుపుతో గోధుమ గడ్డి జ్యూస్ తాగడం వల్ల ఆరోగ్యానికి అనేక లాభాలు కలుగుతాయి. 1. డీటాక్సిఫికేషన్‌లో సహాయపడుతుంది గోధుమ గడ్డి జ్యూస్ అద్భుతమైన డీటాక్సిఫైయింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది లివర్‌ను శుభ్రం చేయడంలో సహాయపడుతుంది, శరీరంలో నిల్వైన హానికరమైన టాక్సిన్లను తొలగిస్తుంది. దీని వలన శరీర శుద్ధి ప్రాసెస్ వేగవంతం అవుతుంది. గోధుమ గడ్డి జ్యూస్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది ప్రత్యేకంగా డయాబెటిక్ పేషంట్లకు మేలైన ఆహారంగా భావించబడుతుంది. "కాఫీ తాగడం మానేస్తున్నారా? ఒక్కసారిగా మీ శరీరంలో కలిగే మార్పులు ఇవే!" 2. రక్తం శుభ్రపరుస్తుంది గోధుమ గడ్డి జ్యూస్‌లో అధిక శాతం కలిగిన రక్తాన్ని శుభ్రం చేస్తుంది. ఇది రక్తంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తుంది, అందువల్ల రక్త ప్రవాహం మెరుగవుతుంది. మానసిక ఉల్లాసాన్ని మెరుగుపరచడంలో మరియు ఆందోళన, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే పోషకాలు మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. 3. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది ఈ జ్యూస్ ప్రోబయాటిక్స్ సమృద్ధిగా కలిగి ఉండి జీర్ణశక్తిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది పొట్టలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను పెంచి, ఆమ్లజనక సమస్యలు, గ్యాస్, మరియు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. 4. రోగనిరోధక శక్తిని పెంచుతుంది గోధుమ గడ్డి జ్యూస్ యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంది. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తక్కువ చేసి, ఇన్ఫెక్షన్లకు ఎదుర్కొనే శక్తిని పెంచుతాయి. రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. "కాకరకాయతో కలిపి ఈ ఆహారాలు అస్సలు తినొద్దు.. ఎంత డేంజరంటే?" 5. చర్మ ఆరోగ్యం కోసం గోధుమ గడ్డి జ్యూస్‌లో ఉండే పౌష్టికాలు చర్మానికి ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఇది చర్మం మెరిసిపోవడానికి సహాయపడుతుంది. పింపుల్స్, మచ్చలు, మరియు ఇతర చర్మ సమస్యలను తగ్గిస్తుంది. జుట్టు రాలడాన్ని నిరోధిస్తుంది. 6. బరువు తగ్గడంలో సహాయపడుతుంది గోధుమ గడ్డి జ్యూస్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఇది మెటబాలిజం వేగాన్ని పెంచుతుంది, శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది, అదే సమయంలో ఫ్యాట్‌ను తొలగిస్తుంది. గోధుమ గడ్డి జ్యూస్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది ఆకలిని తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఖాళీ కడుపుతో గోధుమ గడ్డి జ్యూస్ తాగడం వల్ల కొంతమందికి వికారం, వాంతులు వంటి అనారోగ్యాలు కలగవచ్చు. కనుక ప్రారంభంలో కొద్దిగా జ్యూస్ తీసుకోవాలి, ఒకేసారి అధిక పరిమాణం తీసుకోవడం మంచిది కాదు. శుద్ధమైన గోధుమ గడ్డి మాత్రమే ఉపయోగించాలి. గర్భిణీ మహిళలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డాక్టరు సలహా తీసుకోవాలి.

# చలి పెరుగుతోంది.. చర్మాన్ని పొడిబారకుండా రక్షించుకోండిలా!

నవంబర్ మాసం పూర్తయి డిసెంబర్ మాసం కూడా వస్తోంది. ఇక చలి ఇప్పటికే చంపేస్తుంది. ముందు ముందు డిసెంబర్, జనవరి నెలలలో విపరీతంగా చలి ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే శీతాకాలం కారణంగా చర్మం పొడి బారటం ప్రధానంగా కనిపిస్తుంది. శీతాకాలంలో చర్మం పొడిబారకుండా ఉండేందుకు ఖచ్చితంగా తగిన జాగ్రత్తలను తీసుకోవాలి .మన వంటింటి చిట్కాలతోనే మన చర్మాన్ని కాపాడుకోవచ్చు. అవేమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం. చలికాలం చర్మ సంరక్షణా చిట్కాలు శీతాకాలంలో చర్మం పొడిబారి బారకుండా ఉండేందుకు కొబ్బరి నూనెను ఉపయోగించడం మంచిది. కొబ్బరి నూనె పొడిబారిన చర్మానికి కావలసిన తేమను అందించి చర్మం సాఫ్ట్ గా ఉండేలా చేస్తుంది. కొబ్బరి నూనెలో ఉండే ఫ్యాటీ యాసిడ్ చర్మానికి మెరుపును ఇస్తుంది. ఇక శీతాకాలంలో చర్మ సౌందర్యం కోసం, చర్మం తేమగా మృదువుగా ఉండడం కోసం పాలను ఉపయోగిస్తే మంచిది. పాలలో దూది నానబెట్టి ముఖంపైన అద్దితే చర్మం తాజాగా కనిపిస్తుంది. "శరీరంలో యూరిక్ యాసిడ్ పెంచే కూరగాయలు.. ఎక్కువ తిన్నారో..?" ఇంట్లో ఉండే వీటితో చర్మానికి నిగారింపు ఇక శీతాకాలంలో చర్మం పొడిబారి పగిలిపోయి అసహ్యంగా కనిపించకుండా తేనెను అప్లై చేయడం కూడా ఎంతో మంచిది. పొడిబారిన చర్మంలో తేమదనాన్ని సంతరించుకునేలా తేనె బాగా పనిచేస్తుంది. తేనెను ఒక పల్చని పొరలా చర్మంపై అప్లై చేయడం వల్ల మన చర్మం సున్నితత్వాన్ని, నిగారింపును సొంతం చేసుకుంటుంది. శీతాకాలంలో చర్మం తేమ కోసం ఇలా చెయ్యండి ఇక శీతాకాలంలో చర్మాన్ని కాపాడుకునేందుకు కీరదోస చాలా బాగా పనిచేస్తుంది. కీరదోస చర్మాన్ని చల్లగా ఉంచడమే కాకుండా, చర్మం లో తేమని పెంచి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. చాలామంది శీతాకాలంలో చల్లగా ఉండడం వల్ల ఎక్కువగా నీరు తాగరు. దీనివల్ల శరీరం డి హైడ్రేడ్ అయ్యి చర్మం పొడి బారుతుంది. చర్మాన్ని తేమగా ఉంచడానికి ప్రతిరోజు తగినంత నీటిని తప్పనిసరిగా తాగాలి. 5 5 అలోవెరా జెల్, పెట్రోలియం జెల్లీలతో చర్మం నిగారింపు ఇక శీతాకాలంలో పొడి చర్మం వల్ల కలిగే ఇబ్బందుల నుండి అలోవెరా జెల్ ఉపశమనాన్ని ఇస్తుంది. అలోవెరా జెల్ చర్మాన్ని సహజంగా తేమతో ఉంచి పొడిబారడం నుండి కాపాడుతుంది. శీతాకాలంలో పెట్రోలియం జెల్లీ కూడా చర్మం పొడిబారకుండా రక్షణ నిస్తుంది. ఇక శీతాకాలంలో చర్మం పొడిబారకుండా నిగారింపును సొంతం చేసుకోవాలంటే పైన పేర్కొన్న చిట్కాలను ట్రై చేసి చూడండి.





# సినిమా



## ‘పవన్ సినిమాలకే ఎందుకలా?.. డిప్యూటీ సాబ్ ది స్పష్టమైన వైఖరి’

తెలుగు రాష్ట్రాల్లో థియేటర్స్ బంద్ అంటూ ప్రకటన.. కొద్ది రోజుల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు రిలీజ్.. ఈ రెండు అంశాలపై ఇటీవల ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పందించిన విషయం తెలిసిందే. పవన్ మూవీ రిలీజ్ కు ముందే ఎందుకు ప్రకటన వచ్చిందో దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడు ఆ విషయంపై మరోసారి మాట్లాడారు. పవన్ కళ్యాణ్ గారు నటించిన హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ కు ముందు థియేటర్స్ బంద్ అనే ప్రకటన ఎందుకు బయటకు వచ్చిందని మరోసారి క్వశ్చన్ చేశారు. పవన్ సినిమాల రిలీజ్ సమయంలో కొందరు కావాలనే వివాదాలు క్రియేట్ చేస్తున్నారని ఆరోపించారు. పవన్ ది స్పష్టమైన వైఖరన్నారు. థియేటర్స్ బంద్ అనే విషయం ముందే తెలిసినా ఫిల్మ్ ఛాంబర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఛాంబర్ ముందు స్పందించి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. ఎవరితో చర్చించి థియేటర్ల బంద్ కు పిలుపునిచ్చారో తెలుసుకోవాలని హోంశాఖ కార్యదర్శిని తాను విచారణ చేయమని కోరానని వెల్లడించారు. అంతేగాని.. అరెస్ట్ చేయమని ఆదేశించలేదని స్పష్టం చేశారు. కొందరు అసలు సినిమా కూడా రిలీజ్ అవ్వకుండానే ఫ్లాప్ అంటూ పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. సినిమాల విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని కూడా అన్నారు. బాధ్యత ఉన్న ప్రజా ప్రతినిధిగా సినిమా మ్యాటర్ లో అలా మాట్లాడటం చాలా తప్పు అని ఆయన చెప్పారు. అదే సమయంలో ఏపీ ప్రభుత్వాన్ని కలవాల్సిందని నిర్మాత అల్లు అరవింద్ ఇప్పుడు చెప్పడం హర్షణీయమని అన్నారు. అయితే సినీ పెద్దలు ఏపీ ప్రభుత్వాన్ని కలుస్తారా లేదా అనేది వాళ్ల ఇష్టమని, వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. కానీ తమను కలవలేదని ఏ రోజు కూడా తెలుగు సినిమా నిర్మాతల్ని ఇబ్బంది పెట్టలేదని, అలా జరగదని చెప్పారు. కాగా, సినిమా టికెట్ల రేట్లకు సంబంధించిన శాశ్వత విధానాన్ని ఏపీ ప్రభుత్వం రూపొందించబోతుందని వెల్లడించారు. ప్రతిసారీ ఎవరో ఒకరు టికెట్ రేట్లు పెంచమని వస్తున్నారని, తాము ఓకే చేస్తున్నామని, అది తెలిసిన విషయమేనని అన్నారు. కానీ ఎవరో ఒకరు కోర్టుల్లో పిల్ వేస్తున్నారు. అధికారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పారు. అందుకే కొత్త విధానం రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.





## సవాళ్ల మధ్య కళావతి ప్రయాణం!

కీర్తి సురేష్ అలియాస్ కళావతి జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు ఇప్పుడు తెలుగు, హిందీ, తమిళ్ అంటూ మూడు భాషల్లోనూ సినిమాలు చేస్తోంది. అదనంగా బాలీవుడ్ లో వెబ్ సిరీస్ ల్లో కూడా నటిస్తోంది. కెరీర్ ఆరంభంలో విధించుకున్న నియమ నిబంధలను పక్కనబెట్టి పని చేస్తోంది. గ్లామర్ కం రొమాంటిక్ పాత్రలకు సైతం సై అంటోంది. ఇండస్ట్రీ తన నుంచి ఏ కోరుకుంటుందో వంద శాతం అదే ఇవ్వడానికి తన వంతు ప్రయత్నం చేస్తోంది. మిడ్ నైట్ 50 మందికి చుక్కలు చూపించిన థియేటర్ వివాహం తర్వాత ఎన్నో మార్పులు చేసింది. భర్త నుంచి అన్నిరకాలుగా మద్దతు లభిస్తోంది. దీంతో కీర్తి కెరీర్ లో మరింతగా ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి అన్ని రకాలు ప్రయత్నాలు చేస్తోంది. రేయింబవళ్లు షూటింగ్ ల్లో పాల్గొంటుంది. హైదరాబాద్ టూ ముంబై, చెన్నై అంటూ పరుగులు తీస్తోంది. అవసరమైతే రెండు షిఫ్టులు పనిచేస్తోంది. తాజాగా ఈ ప్రయాణాన్ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకేసారి మూడు భాషల్లో పనిచేయడం అన్నది ఎంతో సవాల్ తో కూడుకున్న పనిగా పేర్కొంది. అయినా నచ్చిన పనని మనస్ఫూర్తిగా స్వీకరించి పని చేస్తున్నట్లు తెలిపింది. ఇలా పనిచేయడం వల్ల నటనా ఫరిదిని విస్తరించినట్లు అవుతుందంది. కెరీర్ లో సవాళ్లు తనకు కొత్త కాదని...ఆరంభంలోనే ఎన్నో ఛాలెంజిగ్ రోల్స్ పోషించినట్లు గుర్తు చేసుకుంది. ఇప్పటికే టాలీవుడ్...కోలీవుడ్ లో ఫేమస్ అయిన నేపథ్యంలో బాలీవుడ్ సినిమాలపై మరింత ఏకాగ్రతతో పని చేస్తోంది. కొత్త అవకాశాలు వెతికి పట్టుకుంటుంది. ‘అక్క’ అనే వెబ్ సిరీస్ లో నటిస్తోంది. ఇందులో బోల్డ్ బ్యూటీ రాధికా ఆప్టేతో పోటీ పడి మరీ నటిస్తోంది. హిందీలో ఇటీవలే మరో చిత్రానికి ఒకే చెప్పింది. తమిళ్ లో ‘రివాల్వర్ రీటా‘ లో నటిస్తోంది. తెలుగులో మరో రెండు కొత్త చిత్రాలకు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చింది.



## ఇప్పుడా లోటు కూడా తీరింది

రాజేంద్ర ప్రసాద్.. ఆయన తన కెరీర్లో ఎన్నో మంచి మంచి సినిమాలు చేశారు. మంచి సినిమాలు చేయడమే కాదు, ఆయన చేసిన ఎన్నో సినిమాలు, అందులోని పాటలు ఆడియన్స్ మనసులో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఇంకా చెప్పాలంటే ఆయన చేసిన సినిమాల్లోని పాత్రలు నిజజీవితంలో ప్రతీ ఒక్కరికీ ఏదొక సందర్భంలో ఎదురువుతూనే ఉంటాయి. ఈ విషయాన్ని రీసెంట్ గా షష్టిపూర్తి ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో రాజేంద్రప్రసాద్ స్వయంగా వెల్లడించారు. ఇండస్ట్రీలో ఎవరికీ రాని అదృష్టం తనకొచ్చిందని అన్నారు. నిజజీవితంలో తన వయసు అరవై ఏళ్లు దాటాయని, ఈ ఏజ్ లో ఎక్కడొచ్చి తన పిల్లలు షష్టిపూర్తి అంటారేమో అని తప్పించుకుంటూ తిరిగానని, కానీ ఈ సినిమాలో అది తప్పలేదని, సినిమాలో షష్టిపూర్తి తనదేనని చెప్పారు. తన కెరీర్లో చేసిన సినిమాల్లో అన్ని రకాల పాటలున్నాయని, అన్ని పెళ్లిళ్లలో తన పెళ్లి పుస్తకం సినిమాలోని పాటే వినిపిస్తుందని, ఆ నలుగురు రిలీజైనప్పటి నుంచి చావు సమయంలో కూడా తన పాట వినిపించడం మొదలైందని, షష్టిపూర్తి టైమ్ లో నా పాట లేదని చాలా మంది అనేవాళ్లని, కానీ ఇప్పుడు ఆ లోటు కూడా తీరిందని, తన కెరీర్లో షష్టిపూర్తి సాంగ్ కూడా వచ్చిందని, ఇలాంటి స్పెషల్ సాంగ్ ను ఇళయరాజా చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు రాజేంద్రప్రసాద్ చెప్పారు. మమితా–కయాదు మధ్యలో కేతిక తన్నుకుపోయిందా? ఇక షష్టిపూర్తి సినిమా విషయానికొస్తే రాజేంద్ర ప్రసాద్, అర్చన కీలక పాత్రల్లో రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా షష్టిపూర్తి. మే 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా విజయవాడలో ట్రైలర్ ను రిలీజ్ చేసింది. మనసును కాకుండా మనిషి అలవాటల్ను ప్రేమించే నువ్వు మార్పు గురించి మాట్లాడకు అని రాజేంద్రప్రసాద్ చెప్పిన ఎమోషనల్ డైలాగ్ ట్రైలర్ లోని ఎమోషన్ ను బాగా హైలైట్ అయ్యేలా చేసింది.



## రాజాసాబ్... ప్రభాస్‌కే ఎందుకు ఇలా జరుగుతుంది?

‘బాహుబలి’, ‘సాహో’, ‘రాధేశ్యామ్’ సినిమాల కోసం చాలా ఏళ్లు సమయం కేటాయించిన ప్రభాస్ తదుపరి సినిమాలను చాలా స్పీడ్‌గా చేయాలని అనుకున్నాడు. అందుకోసం బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు కమిట్ అయ్యాడు. ఏడాదికి రెండు, వీలుంటే మూడు సినిమాలను విడుదల చేయాలని ఆశ పడ్డాడు. అభిమానులతో చాలా సార్లు ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తాను అంటూ హామీ ఇచ్చిన విషయం తెల్సిందే. కానీ దర్శకులు అందుకు సహకరించాలని అన్నాడు. అన్నట్లుగానే ఆయనకు దర్శకుల నుంచి సహకారం అందడం లేదు. రాజాసాబ్ సినిమా గత ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉన్నా ఇప్పటి వరకు విడుదల కాలేదు. ‘రాజాసాబ్’ సినిమాను ఏప్రిల్‌లో కచ్చితంగా విడుదల చేస్తామని మేకర్స్ బలంగా చెబుతూ వచ్చారు. కానీ సినిమా షూటింగ్‌తో పాటు, వీఎఫ్ఎక్స్ వర్క్ కూడా పూర్తి కాలేదు. దాంతో విడుదల వాయిదా వేయాల్సి వచ్చింది. ఏప్రిల్‌లో మిస్ అయినా సమ్మర్ చివరి వరకు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని అంతా ఆశించారు. కానీ ఈ ఏడాది చివరికి సినిమాను వాయిదా వేశారనే వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం 2025 డిసెంబర్‌కి సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సినిమాకు ఆర్థిక ఇబ్బందులు అంటూ పుకార్లు షికార్లు చేశాయి. కానీ సినిమా యొక్క వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి కానందున సినిమా వాయిదా పడ్డట్లు తెలుస్తోంది. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి చాలా సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ లోపు ప్రభాస్ నటిస్తున్న మరో సినిమా ఫౌజీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. సీతారామం దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమాను స్పీడ్‌గా షూటింగ్ చేస్తున్నారు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే సినిమా ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాజాసాబ్ సినిమా మాత్రం 2025 డిసెంబర్‌లో కూడా వచ్చే వరకు అనుమానమే అంటూ కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సినిమాకు ఉన్న బజ్‌ను కాపాడుకుంటూ అనుకున్న సమయంకు విడుదల చేసి ఉంటే కచ్చితంగా రాజాసాబ్ సినిమా ఫలితం మరో రేంజ్‌లో ఉండేది అనేది ఇండస్ట్రీ వర్గాల టాక్. పాపం ప్రభాస్ ఏడాదికి రెండు మూడు సినిమాలు చేయాలని ఎంతగా ప్రయత్నాలు చేసినా, ప్రేక్షకుల ముందుకు ఏడాదికి రెండు మూడు సినిమాలను తీసుకు రావాలని భావించినా కూడా సాధ్యం కావడం లేదు. ఇతర హీరోలు మెల్లగా సినిమాలు చేస్తూ ఏడాదికి ఒకటి లేదా రెండేళ్లకు ఒకటి సినిమాను చేస్తున్నారు. కానీ ప్రభాస్ మాత్రం ఒకే సారి రెండు మూడు సినిమాలు చేస్తున్నా కూడా ఏదో ఒక సమస్య కారణంగా ఆలస్యం అవుతోంది. సలార్ 2, కల్కి 2 సినిమాలు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. రాజాసాబ్ సినిమాతో పాటు ఫౌజీ సినిమా ఈ ఏడాదిలో వస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు. కానీ అది సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు. దాంతో ప్రభాస్‌కే ఎందుకు ఇలా జరుగుతుందని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



